సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్
విద్యార్థుల ప్రభంజనం



సమావేశంలో మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

గుంటూరు (విద్య) జూలై 9 ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులతో ప్రభంజనం సృష్టించారని సంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ వెల్లడించారు. బుధవారం గుంటూరులోని మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు పెనుగొండ సాయి రాఘవేంద్ర రెడ్డి 4 ర్యాంకు మట్టుపల్లి గాయత్రి శ్రావ్య 5, మైత్రికా చోప్రా, బండి రెడ్డి మహేశ్వర్ 6, తోలేటి మనోజ్ఞ, పి కౌశిక్ రాజ్, అద్దేపల్లి విజేత 8వ ర్యాంకు కొండారపు పూర్ణచందు, కురుబ దీక్షిత్ 9 వ ర్యాంకు సముద్రాల సాత్విక, తులసి గౌతమ్ కుమార్ 10వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. జాతీయ స్థాయిలో 10 ర్యాంకుల్లో 11 మంది విద్యార్థులు మాస్టర్ మైండ్‌కు చెందిన వారేనని వెల్లడించారు. విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

● కార్యదర్శులకు డీపీవో ఆదేశాలు

రాజుపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ఆయా పంచాయతీల కార్యదర్శులదేనని డీపీవో నాగేశ్వరరావునాయక్ తెలిపారు. మండలంలోని గణపవరం గ్రామాన్ని బుధవారం డీపీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రతిరోజు చెత్త సేకరణ జరుగుతుందా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గృహాల్లోని వ్యర్థాలను గ్రీన్ అంబాజిడర్లకు అందజేసి, నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.


గణపవరంలో ప్రజలతో మాట్లాడుతున్న డీపీవో నాగేశ్వరరావు నాయక్

లేబర్‌కోడ్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి షేక్ ముజుఫర్ అహ్మద్ ● నరసరావుపేటలో సార్వత్రిక సమ్మె.. కార్మికుల ర్యాలీ

నరసరావుపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్ అమలు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి షేక్ ముజుఫర్‌అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా నరసరావుపేటలో కార్మికులు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ముజుఫర్‌అహ్మద్ మాట్లాడుతూ స్వాతంత్రం రాకముందు సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్రమోదీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. లేబర్‌కోడ్ అమలు చేస్తే కార్మిక వర్గానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. 8 గంటల పని విధానం, ఈఎస్ఐ, పీఎఫ్ తదితరాలు రద్దు అవుతాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులునాయక్, జిల్లా కన్వీనర్ శివకుమారి, నాయకుడు షేక్ సిలార్ మసూద్, ఎంసీపీ ఐయూ రెడ్‌బాషా, కృష్ణ, ఏడుకొండలు, పీడీఎం నాయకులు వెంకటేశ్వరరావు, ఏఐటీయుసీ రాంబాబు,మస్తాన్‌వలి,కోటిరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.



నరసరావుపేటలో కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న భారీ ర్యాలీ

యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉండడమే కారణం

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తురకపాలెం రోడ్డులో జరిగిన కరిముల్లా హత్య కేసులో మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధానికి కరిముల్లా అడ్డుగా ఉన్నాడని కారణంతోనే ఈ హత్య చేసినట్లు పోలీసులు విచారణలో తేలింది. శ్యామలనగర్ మూడో లైన్‌కి చెందిన చాగంటి శివరామరాజు ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో స్తంభాలగరువు రెండోలైన్‌లోని రాజ్యలక్ష్మి నగర్ కు చెందిన కరిముల్లా వదినతో శివరామరాజుకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇదిలా ఉంటే కొంతకాలంగా కరిముల్లాకు, ఆయన భార్యకు మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. కరిముల్లా భార్య కూడా ఆయన వదిన వద్దే ఉంటుంది. కాపురానికి రమ్మని ఎన్నిసార్లు కరిముల్లా అడిగినా ఆమె నిరాకరించింది. దీంతో తన భార్యపై కూడా కరిముల్లాకు అనుమానం వచ్చింది. దీంతో శివరామరాజుపై కరిముల్లా కక్ష పెంచుకున్నాడు. ఈ వ్యవహారం వారి మధ్య గొడవలకు కారణమైంది. దీంతో ఎలాగైనా కరిముల్లాను అడ్డుతొలగించుకోవాలనుకున్నాడు శివరామరాజు. ఇందుకు తన స్నేహితుడైన స్తంభాలగరువు మూడో లైనుకు చెందిన లావునూరి మధుసూదన్‌రెడ్డికి డబ్బు ఆశ చూపి కరిముల్లాను చంపాలని శివరామరాజు ప్రోత్సహించాడు. దీంతో మధుసూదన్‌రెడ్డి 15 రోజులుగా కరిముల్లాతో మరింత సన్నిహితంగా ఉంటున్నట్లు నటించాడు. గత ఆదివారం మధుసూదనరెడ్డి తన ఆటోలో కరిముల్లాను తురకపాలెం రోడ్డులోకి తీసుకు వెళ్లి కరిముల్లాకు మద్యం తాగించాడు. ఆ తర్వాత అరటి కాయల కత్తితో గొంతు కోసి చంపేశాడు. మృతదేహాన్ని పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి నెట్టి ఇంటికి వచ్చేసాడు. ఈ క్రమంలో నల్లపాడు పోలీసులు ఈ కేసులో నిందితులైన మధుసూదన్ రెడ్డి, శివరామరాజులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. తొలుత శివరామరాజు ఈ హత్యతో తనకి ఎటువంటి సంబంధం లేదని శివరామరాజు వాదించినప్పటికీ, మధుసూదన్ రెడ్డి చెప్పిన వివరాలు ప్రకారం పోలీసులు విచారించగా శివరామరాజు ఆదేశాల మేరకే ఈ హత్య జరిగినట్లు నిర్ధారించారు. కేసును పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

గంజాయి తాగుతున్న ఇద్దరు యువకుల అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గుంటూరు-1 ఎక్సైజ్ సీఐ లత బుధవారం తెలిపారు. అన్నమయ్యనగర్ రెండవ


నిందితులను అరెస్టు చేసిన వన్‌టౌన్ ఎక్సైజ్ సీఐ లత, సిబ్బంది

వీధిలో శివనాగరాజు కాలనీకి చెందిన బత్తుల గోపి, రాజీవ్ గాంధీనగర్‌కి చెందిన కుంభ కార్తీకేయ లు గంజాయి తాగుతూ ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 203, 20 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుని ఇద్దరిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. సీఐ లత మాట్లాడుతూ ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐలు షరీఫ్, తిరుమలేశ్వరరావు సిబ్బంది కె. పూర్ణచంద్రరావు,. బసవేశ్వరరావు, వీరాంజనేయులు, గోపి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 14.43 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెకక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,600 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

టీడీపీ కార్యకర్తపై గొడ్డలితో దాడి


గాయాలతో రవీంద్ర

మాచర్ల రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడులో టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కంభంపాడు గ్రామానికి చెందిన కారుమంచి రవీంద్ర పొలంలో పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పుట్ల వెంకయ్య, శివ, యర్రంకయ్య, వీర్ల సోమలింగంలు జీవాలను పొలంలో తోలారు. మా పొలంలో మేపవద్దని అలా మేపితే ఊరుకునేది లేదని రవీంద్ర వారిని అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు గొడ్డలితో దాడి చేసి గాయపరిచారు. గాయపడ్డ రవీంద్రను బంధువులు వైద్యం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం దాడి సంఘటనపై మాచర్ల రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య


వెంకటేశ్వర్లు(ఫైల్)

బొల్లాపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేళ్ళవాగు గ్రామానికి చెందిన గంగనబోయిన వెంకటేశ్వర్లు(37) బుధవారం తన పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటేశ్వర్లు రెండు రోజుల క్రితం తన భార్య కృష్ణ కుమారిని పొలంలోనే హత్య చేశాడని, ఈ నేపథ్యంలో తాను కూడా బుధవారం తన పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకొని చని పోయాడని తెలిపారు. కుటుంబ మనస్పర్ధల కారణంగా ఈ సంఘటనలు జరిగినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఏ బాలకృష్ణ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోవటంతో కుమారుడు నాగ లక్ష్మయ్య, కుమార్తె శ్రీవాణిలు రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది. శ్రీవాణి ఇంటర్ చదువుతుండగా, నాగ లక్ష్మయ్య ఇటీవల 10వ తరగతి పూర్తి చేశాడు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నరసరావుపేట లీగల్, జూలై 9, (ఆంధ్రజ్యోతి): సాతులూరు, జొన్నలగడ్డ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడు నలుపు చొక్కా నలుపు రంగు ప్యాయింట్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో మద్దిల రామకృష్ణ తండ్రి పేరు లక్ష్మయ్య, గోదికొమ్ము సింగవరం, విజయనగరం అనే ఆధార్ కార్డు ఉంది. మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే నరసరావుపేట రైల్వే పోలీస్ లను సంప్రదించాలని రైల్వే ఎస్సై తెలిపారు.

పెనుమాక రైతులతో మంత్రి నారాయణ సమావేశం


రైతులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తాడేపల్లి (పెనుమాక), జూలై 9 (ఆంధ్రజ్యోతి): పెనుమాకలో మంత్రి నారాయణ బుధవారం రాత్రి పర్యటించి రాజధానికి భూములు ఇచ్చిన రైతులతో సమావేశమయ్యారు. లాండ్ పూలింగ్ లో భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లు కేటాయింపుపై చర్చలు జరిగాయి. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల కేటాయింపుపై రైతులు తమ అభి ప్రాయాలను మంత్రి నారాయణకు వివరించారు. జరీబు కింద ఇచ్చిన ప్లాట్లకు సం బంధించి పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సుమారు 1100 ఎక రాలు జరీబు ల్యాండ్ వుండగా పూలింగ్‌కు 850 ఎకరాలు రైతులు ఇవ్వడంతో ప్లాట్ల కేటాయింపు విషయమై చర్చకు వచ్చింది. ప్రస్తుతం దానికి సంబంధించి రెసిడెన్సియల్ ప్లాట్లు ఇచ్చి, కమర్షియల్ ప్లాట్లు తదుపరి కేటాయిస్తామని అధికారులు చెప్పగా రైతులు అలా కాకుండా రెండింటిని ఒకేసారి ఇవ్వాలని కోరారు. పలు స్థలాలకు రోడ్ల పోటు విషయాలపై చర్చించారు. రైతులు కోరిన విధంగా ప్లాట్లు కేటాయింపులు చేస్తామని ఆ విధంగానే కేటాయింపు చేయాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. ఈ నెల 11న ప్లాట్లు కేటాయించాల్సి ఉండగా అన్ని విషయాలు పరిగణలోకి తీసుకున్న తరువాత ప్లాట్లు కేటాయిస్తామని మంత్రి చెప్పారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు, అధికారులు, స్థానిక గ్రామ రైతులు, ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి క్షమాపణలు చెప్పాలి


ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై సభ్య సమాజం తలదించుకునేలా వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన జుగుప్సాకర వ్యాఖ్యలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఖండించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లిని, చెల్లిని దూషించే జగన్, వైసీపీ నేతల నుంచి ఇంత కంటే హుందాతనమైన భాషను ఆశించలేమని, మహిళల వ్యక్తిత్వంపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం హేయనీయమన్నారు. నారా భువనమ్మ దగ్గర నుంచి మొన్న అమరావతి మహిళలను, నేడు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని దూషించడం చూస్తే మహిళల పట్ల వైసీపీ నేతలకు ఎంత చులకన భావం ఉందో అర్థమవుతుందన్నారు. తక్షణమే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వైసీపీ నేతలు క్షమాపణ చెపాల్సని, లేకుంటే మహిళలు ఆదిపరాశక్తులై కీచక వైసీపీ నేతలను తరిమికొట్టడం ఖాయమన్నారు.

6 నెలల తర్వాత టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి

రెండు యూనిట్లను పరిశీలించిన శ్రీశైలం ప్రాజెక్టు సీఈ తిరుమల ప్రసాద్


ప్రాజెక్టు ఇంజనీర్లతో చర్చిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు సీఈ తిరుమల ప్రసాద్

రెంటచింతల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో బుధవారం రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. కిందటేడాది డిసెంబర్ 13 తరువాత కరెంట్‌ను తయారీ చేయడం ఇదే ప్రథమం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీశైలం ప్రాజెక్టు సీఈ జి.తిరుమల ప్రసాద్ హాజరయ్యారు. ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 2026 మార్చి 31 వరకు 78 ఎంయుల విద్యుత్ తయారు చేయాలనేది టార్గెట్‌గా నిర్ణయించారని గతేడాదిలా లక్ష్యాన్ని అధిగమించాలని గుర్తు చేశారు. రెండు యూనిట్లను, ఎంసీఆర్‌ను, 20 రేడియల్ క్రస్ట్‌గేట్లను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు 322 మెగావాట్ల విద్యుత్‌ను తయారు చేయగా టేల్‌రేస్ ఛానల్ ద్వారా కృష్ణానదిలోకి 8799 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రసుత్తం రిజర్వాయర్‌లో 7.0800 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.50 మీటర్లకు సమానం. సీఈ జి.తిరుమల ప్రసాద్‌ను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈ వేంకటరమణ, జీఎం శ్రీనివాస్, ఈఈ సుబ్రహ్మణ్యం, నాగరాజు, ఏడీఈ రత్తయ్య, సుబ్బారావు,రాజేష్ పాల్గొన్నారు.

జగన్ పర్యటన బల ప్రదర్శన కోసమే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జగన్ చిత్తూరు జిల్లా పర్యటనతో రైతులకు ఒరిగిందేమి లేదని, కేవలం బలప్రదర్శన కోసం అక్కడకు వచ్చారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట గురించి, సాగు గురించి తెలియని జగన్ పదవీకాంక్షతో ప్రభుత్వంపై బురద జల్లుతున్నాడని విమర్శించారు. రైతుల పరామర్శ పేరుతో గొప్పగా రక్తి కట్టిద్దామన్న జగన్ నాటకం అభాసుపాలైందని, రైతుల స్థానంలో కార్యకర్తల్ని ఉంచి బంగారు పాళ్యంలో వైసీపీ చేసిన విన్యాసాలను ప్రజలు ఛీ కొడుతున్నారని వివరించారు. సరైన ధరలేదని, రైతులు నష్టపోకూడదనే చంద్రబాబు మిర్చి, పొగాకు, కోకో, మామిడి ఉత్పత్తుల్ని ప్రభుత్వమే కొనేలా చేశారని తెలిపారు. ఇప్పటికే పొగాకు రైతులకు రూ.270 కోట్ల వరకు చెల్లించారని, మామిడికి ప్రభుత్వం తరపున కిలోకు రూ.4లు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.

ఎస్టీ ఉద్యోగ నియామకంలో రిజర్వేషన్లు పాటించాలి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

పెదకాకాని, జులై 9(ఆంధ్రజ్యోతి): ఎస్టీల ఉద్యోగ నియామకాలలో రిజర్వేషన్లు పాటించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో రాష్ట్ర ఎస్టీ కమి


ప్రసంగిస్తున్న శంకర్‌రావు

షన్ సెక్రెటరీ కే రామశేషు, విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే గంగాధర రావు, ఫ్యాకల్టీ, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, స్టూడెంట్స్, కాలర్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ విద్యార్థులు, కాలర్స్ అడ్మిషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నారో లేదో పరిశీలించడానికి వచ్చానని తెలిపారు.

రోస్టర్ పాయింట్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఎస్టీలు రాజ్యాంగ పరంగా వచ్చిన హక్కులను ఉపయోగించుకోవాలని, మనకు ఎదురైన సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా చెప్పాలని, మీ సమస్యలను కమిషన్ ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. వర్సిటీలో స్కాలర్‌షిప్, హాస్టల్ ఫెసిలిటీ తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ప్రొఫెసర్ రత్నశీలమణి, జి. సింహాచలం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలో రూ. లక్ష మాయం

గురజాలటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురజాలకు చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావుకు చెందిన బ్యాంకు ఖాతాలో రూ. లక్ష మాయమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మాచర్ల రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఖాతాలో గత నెల 15వ తేదీన తన ఫోన్‌లో పీఎం కిసాన్ యోజన పథకం క్లిక్ చేశానని బుధవారం ఖాతాను తనిఖీ చేయగా రూ. లక్ష మాయమయ్యాయని, దీనిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

37,578 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 39,011 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,578 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,839 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	12700	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13200	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13300
341	10000	13400	273	---	----
4884	----	----	341	10000	13500
సూపర్ 10	----	----	4884	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500	తేజ	10000	13400
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	---	----
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4800	7000

తల్లికి వందనం.... గందరగోళం!

(5వ పేజీ తరువాయి)

డబ్బులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడానికి కసరత్తు చేస్తోంది. కానీ ఈ విషయంలో తల్లుల అనుమానాలను తీర్చడంలో విద్యాశాఖ నిర్లక్ష్యం వహించడంతో తమ ఖాతాల్లో డబ్బులు పడలేదన్న హైరానా వారిలో వ్యక్తమవుతోంది

ఎస్సీ విద్యార్థుల విషయంలోనూ అంతే...

తల్లికి వందనం నిధుల విడుదల సమయంలో కొంతమంది ఎస్సీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,900 మాత్రమే జమ అయినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. నిజానికి ప్రభుత్వం నిధుల విడుదల సమయంలోనే ఈ విషయంపై స్పష్టత ఇచ్చింది. స్వల్పమొత్తంలో కార్పొరేషన్ నిధులను దీనికి అనుసంధానం చేశామని, ఎవరికైనా డబ్బుల్లో కోత పడితే, అందులో నిధులు జమ కాగానే ఖాతాల్లో ఆటోమేటిక్‌గా పడతాయని తెలిపింది. కానీ ఈ విషయంపై సదరు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలోనూ మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఆ డబ్బుల విషయంలో తల్లులు గందరగోళ పడుతుండగా, ప్రభుత్వం ఆ డబ్బులను స్వాహా చేసిందనే ప్రచారం కూడా బయట పెద్దఎత్తున జరుగుతోంది. పథకానికి సంబంధించి డబ్బుల జమ విషయంలో విద్యాశాఖ వైపు నుంచి ఇప్పటి వరకు ఓ ప్రకటన జారీకాకపోవడం ఒక ఎత్తయితే అపోహల నివృత్తికి తీసుకున్న చర్యలేంటనే దానికి వారి వద్ద సమాధానమే లేదు

అర్హత ఉన్నా అందలేదని 1207 మంది తల్లులు

తల్లికి వందనం పథకానికి సంబంధించి అన్ని అర్హతలున్నా తమ ఖాతాల్లో డబ్బులు పడలేదని జిల్లా వ్యాప్తంగా 1207 మంది తల్లులు పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్) గడప తొక్కారు. ఇందులో 831 మంది అర్జీలు సహేతుకమైనవిగా గుర్తించి అధికారులు స్వీకరించారు. 229 మందిని అర్హులుగా గుర్తించినట్లు సమాచారం. మిగిలిన వారి విషయంలో గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిన వెబ్‌ల్యాండ్ డేటా వారి పాలిట శాపంగా మారినట్లు తెలుస్తోంది. కేవలం పీజీఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఇదే కాగా సచివాలయాల వారీగా భారీగా తల్లికి వందనం దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. పథకం అమలు జరిగి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు జిల్లాలో అర్హత ఉండి ఈ కేవైసీతో పాటు తల్లిమరణం, లేదా విద్యార్థి మృతి వంటి కారణాలతో ప్రభుత్వం నిధుల జమ చేయని వారు ఉన్నారు. ఈకేవైసీ విషయంలో ఉన్న సాంకేతిక చిక్కులు తొలగించుకున్న వారికి త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. అధిక భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఉండడం, ఆదాయపుపన్ను, ఫోర్ వీలర్ ఉండడం వంటి కారణాలతో పథకానికి అనర్హులుగా మారిన వారు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గత ప్రభుత్వ తప్పిదాలతో పథకానికి దూరమైన వారు ఉన్నారు

డేటా విషయంలో నిర్లక్ష్యమే...

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం నిధులు డబ్బులను పెద్ద ఎత్తున తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఇంతటి కీలకమైన పథకం డేటా విషయంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం విమర్శలకు తావిస్తోంది. పైగా పథకం అమలు తీరుతెన్నులపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలన్న స్పృహే కరువైంది. డబ్బులు విడుదల చేసి నెల కావొస్తుండడం ఒక ఎత్తయితే మలి విడత తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. కానీ ఇప్పటి వరకు జిల్లాల్లో అర్హత ఉండి పథకానికి దూరమయిన వారి సంఖ్య, అనర్హులుగా ప్రభుత్వం తేల్చిన వారి సంఖ్య కచ్చితత్వంతో అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. పైగా విద్యాశాఖ, సచివాలయ విభాగాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారే తప్ప పథకం లోపాలపై దృష్టిపెట్టడం, తల్లుల్లో ఉన్న గందరగోళానికి తెరదించుదామనే ప్రయత్నం జరగకపోవడం విస్మయం కలిగిస్తోంది. సచివాలయాల వారీగా జాబితా ప్రదర్శించామని చెబుతున్నప్పటికి అది కూడా ప్రహసనంలాగానే నడిచింది తప్ప చిత్తశుద్ధి కొరవడిందనే వ్యాఖ్యలు తల్లుల నుంచి వినిపిస్తున్నాయి



జిల్లా పోలీసుశాఖకు డ్రోన్‌లు బహూకరించిన దాతలతో ఎస్పీ తుషార్ డూడి

నేరాల నియంత్రణకు డ్రోన్‌లతో నిఘా కీలకం : ఎస్పీ

● జిల్లా పోలీసుశాఖకు 6 డ్రోన్‌లను బహుకరించిన దాతలు

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాల కట్టడి, నేరాల నియంత్రణకు డ్రోన్‌లతో నిఘా కీలకమని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 6 డ్రోన్‌లను జిల్లా పోలీసుశాఖకు దాతలు బుధవారం బహుకరించారు. బహుకరించిన దాతలను ఎస్పీ ఘనంగా సన్మానించి సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వినూత్న ఆలోచనలతో ప్రేరణ పొంది జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, నిఘా, విపత్తుల నిర్వాహణ కోసం సామాజిక బాధ్యతతో, సేవాదృక్పధంతో డ్రోన్‌లను బహుకరిస్తున్నట్లు దాతలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక సాంకతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని స్మార్ట్ పోలీసింగ్ వైపు అడుగులు వేస్తున్న జిల్లా పోలీసు శాఖను మరింత పటిష్ఠం చేసేందుకు ఈ డ్రోన్‌లు మద్దతుగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జునరావు,రూరల్ సీఐ సురేష్, వేమూరు సీఐ ఆంజనేయులు, నిజాపట్నం, భట్టిప్రోలు, వేమూరు, చెరుకుపల్లి ఎస్సైలు, దాతలు పాల్గొన్నారు.

నూటపది వసంతాల విద్యానిలయం

● నేడు టీచర్స్ అండ్ పేరెంట్స్ సమావేశం



సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నూటపదేళ్ళ క్రితం స్త్రీల కోసం ఒక చిన్న విద్యాలయాన్ని నెలకొల్పారు. నేడు ఆ చిన్న విద్యాలయం పెరిగి పెద్దదిగా మారి డిగ్రీ వరకు చదువుకునే అవకాశం కల్పించారు. 1915వ సంవత్సరంలో బాపట్లలో పేరు గాంచిన విదూషిమణి చోరగుడి సీతమ్మ యువతీ విద్యానిలయం పేరిట ప్రత్యేకంగా స్త్రీల కోసం పాఠశాలను స్థాపించారు. ఆ చిన్న విద్యాసంస్థ నేడు జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలతో అభివృద్ధి చెందింది. బాలికలు ఇక్కడ 6వ తరగతిలో చేరితే డిగ్రీ వరకు చదువుకునే అవకాశం ఉంది. ఒకప్పటి యువతీ విద్యానిలయం 2014-2015 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చెందింది. బాపట్ల పరిసర ప్రాంతాలలోని బాలికలను తల్లిదండ్రులు ఇక్కడ చదివించేందుకు ఆసక్తి చూపటంతో అంచలంచలుగా అభివృద్ధి చెందింది. ఈ ఏడాది పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం ఇక్కడ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. గురువారం జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

వాలీబాల్ పోటీలలో పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు తదితరులు

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ స్కూల్ వాలీబాల్ పోటీలలో బాపట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండలో జరిగిన ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బుధవారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.సుబ్బరామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. 10వ తరగతి విద్యార్థులు బి.దిలీప్, కె.మోహన్, ఎ.వైభవ్, కె.కార్తీక్, ఎస్కే రహమాన్, హెచ్.సంతోష్, ఎం.సాత్విక్‌లు పోటీలో నైపుణ్యం ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలవటం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పీడీ ఎం.రామారావు నేతృత్వంలో ఈ విజయాన్ని సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.వెంకట్రావు, పి.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి డి.వెంకయ్య, కోశాధికారి కోట వీరబ్రహ్మయ్య, సూపరింటెండెంట్ ఎన్.శ్రీధర్, పీఈటీ సయ్యద్ అన్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వ్యాఖ్యలు దారుణం : గుంటుపల్లి

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణమని జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి అన్నారు. పార్టీశ్రేణులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జనసేనపార్టీ అధినేత పవన్‌కల్యాణ్ గురించి ఇటీవల కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, పసుపులేటి మహేష్, కామిశెట్టి సాయిబాబు, కామిశెట్టి శివపార్వతి, సాయిల రాంబాబు, రాజశేఖర్‌రెడ్డి, రామారావు, అంకిరెడ్డి, అనూష్, కార్తీక్ పాల్గొన్నారు.

వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనం : కొల్లా

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఎమ్మెల్యే ప్రశాంతరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం అసహ్యించుకుంటుందని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాల్సిన ఆయన వాటికి కట్టుబడి ఉన్నానని ప్రకటించటం అతని నీచత్వానికే కాక వైసీపీ విష సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

ఆత్మస్థైర్యం పెంపొందించే విధంగా పాఠ్యాంశాలు బోధించాలి

● రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి




విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులలో ఆత్మస్థైర్యం పెంపొందించే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న వసతులు, విద్యాప్రమాణాలు గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులు, వంటగదులను పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. టోల్‌ఫ్రీనెంబరు 1098 డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుతూ విద్యనందించాలి

కర్లపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులను కాపాడుతూ వారికి విద్యనందించాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. కర్లపాలెం మండలంలో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్యానికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి టి.మనోరంజని, బాపట్ల జిల్లా జీసీడీవో చారులత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు : సీఎస్‌డీటీ



రేషన్‌షాపులను తనిఖీ చేస్తున్న ఫణికుమార్ తదితరులు

కర్లపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని డీలర్‌లు పక్కదారి పట్టిస్తే తగు చర్యలు ఉంటాయని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఫణికుమార్ హెచ్చరించారు. కర్లపాలెంలోని పాతనందాయపాలెంలో గల రేషన్‌షాపులను అదేవిధంగా బాపట్ల గ్రామీణ ప్రాంతంలోని ఐదు రేషన్‌షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపులు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఓపెన్ చేసి ఉంచాలన్నారు. రేషన్ పంపిణీ విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించవద్దని అన్నారు.

అందరూ మెచ్చే విధంగా కూటమి పాలన

● బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్



చిన్నపరిమిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు (చుండూరు), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అందరూ మెచ్చే విధంగా కూటమి పాలన కొనసాగుతున్నదని బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం చుండూరు మండలం చినపరిమి, ఆలపాడు గ్రామాలలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చినపరిమిలో ప్రధాని సడక్ యోజన పథకం ద్వారా రూ.5.13 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, ఆలపాడులో ఉపాధి నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి ప్రారంభించారు. ఇరువురు కలిసి ఇంటింటికి తిరిగి వివిధ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆనందబాబు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిని కూడా ఉన్నతమైన స్థానానికి ఎదగాలని కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలను కూడా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల టీడీపీ అధ్యక్షులు శివారెడ్డి, చుండూరు సొసైటీ అధ్య క్షులు ఎల్లారెడ్డి, బీసీ సంఘం నాయకులు శ్రీమాన్ వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, చందోలు జాన్, జనసేన నాయకులు శివయ్య, ఎంపీడీవో సుదీప, పంచాయితీరాజ్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ మరియదాసు పాల్గొన్నారు.

వ్యర్థాలు వేరుచేసిన తర్వాతే సేకరించాలి : కమిషనర్

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజు సేకరించే చెత్తను తడి, పొడి చెత్త, హానికర వ్యర్థాలు వేరు చేసిన తర్వాత మాత్రమే సేకరించే విధంగా నిరంతర పర్యవేక్షణ చేయాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని పలువార్డులలో కమిషనర్ సిబ్బందితో కలిసి బుధవారం పర్యటించారు. 34వవార్డు దర్శిపెదమస్తాన్ నగర్, కృష్ణమందిరం ప్రాంతాలలో తాగునీటి సరఫరా గురించి తెలుసుకున్నారు. అనంతరం వర్మీకంపోస్ట్‌కు అవసరమైన స్థల సేకరణ కొరకు కర్లపాలెం రోడ్డులో మార్కెట్ యార్డు సమీపంలో గల పురపాలక సంఘ స్థలాన్ని, ఆంధ్రకేసరి నగర్‌లో గాయత్రినగర్ లేఅవుట్‌లోని పురపాలక సంఘ స్థలాన్ని కూడా పరిశీలించారు. మున్సిపల్ డీఈ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు సయ్యద్ నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

కల్తీ విత్తనాలతో మోసపోయిన గోంగూర పంట రైతులు

బాపట్లరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలపరిధిలో కొన్ని వందల ఎకరాలలో గోంగూర పంటను రైతులు సాగు చేశారు. అయితే కల్తీ విత్తనాలు కలవటంతో గోంగూర పంటలో పిచ్చి గోంగూర కావటం సరైన ఎత్తు ఎదగకపోవటం లాంటివి జరిగాయి. పట్టణంలోని కొన్ని విత్తనాల దుకాణాలలో కేజి రూ.150 చొప్పున అధిక ధరకు వ్యాపారస్తులు రైతులకు గోంగూర కల్తీ విత్తనాలను విక్రయించారు. ఉన్నతాధికారులు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులు విలువలను పెంపొందించుకోవాలి : గంగాధర్

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు దేశభక్తి, చైతన్యం, సామాజిక బాధ్యత, సేవాభావం వంటి విలువలను పెంపొందించుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ గంగాధర్ తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలలో బుధవారం ఏబీవీపీ 77వ జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గంగాధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. పర్యావరణం, వ్యవసాయం, టెక్నాలజి వంటి రంగాలలో శాస్త్రీయ దృష్టితో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివగోపి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవాలయాల భూములకు కౌలు వేలం

పిట్టలవానిపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంకు చెందిన సంగుపాలెం, కోడూరు గ్రామంలో గల 1.80 సెంట్ల మాగాణి భూమి, శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానానికి సంబంధించి రాంభోట్లవారిపాలెం గ్రామంలో గల 8 ఎకరాల 19 సెంట్ల మాగాణిభూములకు సంబంధించిన కౌలు హక్కుల బహిరంగవేలం పాట జరుగుతుందని త్రిముఖ దేవాలయాలకు చెందిన ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలోని కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలు నుంచి వేలం పాట జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు ప్రథమ దరవత్తు రూ.5 వేలు చెల్లించి ఈవేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

కోన ప్రభాకరరావు జయంతి జయప్రదం చేయాలి

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : విభిన్న రంగాలలో విశిష్ట ఖ్యాతినార్జించిన మాజీ మంత్రి, మాజీ గవర్నర్ దివంగత కోన ప్రభాకరరావు 109వ జయంతిని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పిలుపునిచ్చారు. ఈ విషయమై బుధవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం పాతబస్టాండ్ కూడలిలో ఆయన విగ్రహం తొలిగించిన చోటే వేడుకలు జరుగుతాయన్నారు. పురవీధులలో ర్యాలీ నిర్వహించి పాతబస్టాండ్ దగ్గర నివాళులు అర్పించటం జరుగుతుందన్నారు. రోడ్డు విస్తరణలో తొలిగించిన కోన ప్రభాకరరావు విగ్రహాన్ని అదేప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఏడుకొండలురెడ్డి, జోగి రాజా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ దేవకుమార్‌కు సన్మానం

అమృతలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పెదపూడి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా నియమితులైన కొసరాజు దేవకుమార్‌ను మహిళలు సన్మానించారు. మండల పరిధిలోని తురుమెళ్ళలో జరిగిన కార్యక్రమంలో దేవకుమార్‌ను, అమృతలూరు సహకార సంఘం చైర్మన్ క్రొత్తపల్లి రవీంద్రబాబులను పూలమాలలు, శాలువాలతో మహిళలు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శరణుగిరి, నరేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

వేమూరు (చుండూరు), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన సావిత్రమ్మ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ సహాయాన్ని కోరుతూ ఎమ్మెల్యే ఆనందబాబుకు లేఖ రాశారు. స్పందించిన ఆనందబాబు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3 లక్షల 50 వేలు మంజూరు చేయించి సంబంధించిన చెక్కును బుధవారం సావిత్రమ్మ కుటుంబానికి అందజేశారు.

కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బాపట్లరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కప్పలవారిపాలెం గ్రామ సమీపంలోని నాగరాజు కాల్వ వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. బాపట్ల రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బాపట్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెరువుజమ్ములపాలెం ఆర్‌వోబీపై బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ట్రక్కు ఆటో ఢీకొట్టటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు.



రేపల్లెలో ర్యాలీనిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ, న్యూకార్మికసంఘాలు

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

రేపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి) : కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. కార్మికుల దేశవ్యాప్తంగా సమ్మె సందర్భంగా బుధవారం పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ, న్యూ కార్మిక సంఘాలు ఉమ్మడిగా రేపల్లె బస్టాండ్ నుంచి రింగురోడ్డు వరకు భారీ ప్రదర్శన చేశారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శామ్యూల్ మాట్లాడుతూ జాతీయప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాన్ని రద్దు చేసి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీసంఘం రాష్ట్ర నాయకురాలు ఎన్.శోభారాణి, ఏఐటీయూసీ నాయకురాలు వాణి తదితరులు పాల్గొన్నారు.

● సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం రేపల్లెలో ఏఐటీయూసీ, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు గొట్టుముక్కల బాలాజీ, నాయకులు, సిరంశెట్టి శ్రీనివాసరావు, శివశంకర్, పోతురాజు, రాజ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, సాంబశివరావు, సురేష్, గౌరీ, వి.వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


● వేమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రైల్వే గేటు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అగస్టీన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు బసవమ్మ, అంగన్‌వాడీ, ఆశ, పంచాయతీ ముఠా కార్మికులు, ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలులోని రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని వాటిని తిప్పి కొట్టేందుకు కార్మికులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కొల్లూరులో దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఆశాలు, అంగన్‌వాడీలు, కార్మికులు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. సీఐటీయూ నాయకులు మనోజ్‌కుమార్, మురుగుడు సత్యనారాయణ, గోళ్ల నాగరాజు, దీపాల సత్యనారాయణ, సురేష్, రమాదేవి, వేములపల్లి వెంకట్రామయ్య, బి.సుబ్బారావు పాల్గొన్నారు.


సహకార సంఘాలకు అధ్యక్షుల నియామకం

భట్టిప్రోలు, కొల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం అధ్యక్షులను నియమిస్తూ జీవో విడుదల చేసింది. కొల్లూరు మండలంలో క్రాప పీఏసీఎస్ అధ్యక్షుడిగా కోగంటి హరిప్రసాద్, డైరెక్టర్లుగా తుమ్మల వెంకటవీరబాపయ్య చౌదరి, డొక్కు నాగేశ్వరరావు, గాజుల్లంక పీఏసీఎస్ అధ్యక్షుడిగా గళ్లా తిరుపతి వెంకయ్య, డైరెక్టర్లుగా కోగంటి వెంకటరామారావు, సుగ్గున వెంకటేశ్వరరావు, ఈపూరు పీఏసీఎస్ అధ్యక్షుడిగా మేకా దివాకరేంద్ర చౌదరి, డైరెక్టర్లుగా దూళిపూడి రామాంజనేయులు, వాసుమల్లి రత్నబాబు, దోనేపూడి పీఏసీఎస్ అధ్యక్షుడిగా వెనిగళ్ల మహేష్, డైరెక్టర్లుగా యార్లగడ్డ శ్రీనివాసరావు, వాకా రెడ్డియ్య, భట్టిప్రోలు పీఏసీఎస్ అధ్యక్షుడిగా పరుచూరి రమేష్, డైరెక్టర్లుగా కొలుసు వెంకటశేషగిరిరావు, గొట్టిపాటి కృష్ణారావులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మూడు సొసైటీలకు...



ఎల్లారెడ్డి



శివశంకర్‌రెడ్డి

వేమూరు (చుండూరు), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండలంలోని మూడు వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు నూతన పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చుండూరు సంఘానికి అధ్యక్షుడిగా గుదేటి ఎల్లారెడ్డి, డైరెక్టర్లుగా కుర్రి శ్రీనివాసరెడ్డి, కావూరు కోటేశ్వరరావు, మోదుకూరు సంఘానికి అధ్యక్షుడిగా అన్నపరెడ్డి శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్లుగా పద్యాల కేశవ, గడికో ప్రతాపరెడ్డి, యడ్లపల్లి సంఘానికి అధ్యక్షుడిగా దాసరి సుధాకర్, డైరెక్టర్లుగా అక్కల కోటిరెడ్డి, తమ్మా శివకోటిరెడ్డిలను నియమించారు. నూతనంగా నియమితులైన అధ్యక్షుడు, డైరెక్టర్లు తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

చెరుకుపల్లి మండలంలో మూడు సొసైటీలకు...



ఎం.తాతాజీ



ఎ.నరేంద్రబాబు



ఎస్.శ్రీనివాసరావు

చెరుకుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కావూరు పీఏసీఎస్‌కు మండవ తాతాజీ చైర్‌పర్సన్‌గా, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, కాటూరి నరసింహారావు, డైరెక్టర్‌లుగా నియమితులయ్యారు. గూడవల్లి పీఏసీఎస్‌కు ఆలపాటి నరేంద్రబాబు చైర్మన్‌గా, పిట్టుబాబురావు, షేక్ బాబు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. నడింపల్లి పీఏసీఎస్‌కు సనకా శ్రీనివాసరావు చైర్‌పర్సన్‌గా, శ్రీపతి వెంకటేశ్వర్లు, తాతా సాంబశివరావు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. తమ ఎంపికపై మంత్రి అనగాని సత్యప్రసాద్‌కి, అనగాని శివప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ అధ్యక్షుడిగా మైలా నరేష్‌యాదవ్

నిజాంపట్నం(రేపల్లె), జూలై 9(ఆంధ్రజ్యోతి) : సొసైటీ అధ్యక్షుడిగా జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మైలా నరేష్ యాదవ్ నియమితులైనట్లు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. నరేష్ యాదవ్‌ను అనగాని శివప్రసాద్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మత్తి భాస్కరరావు, జడ్‌పీటీసీ నర్రా సుబ్బయ్య అభినందించారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా విడుదల

చెరుకుపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా ప్రతి గ్రామంలో రైతుసేవా కేంద్రంలో పెట్టామని, మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూఖ్ ఒక ప్రకటనలో తెలిపారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, పార్టీనాయకులు

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టవానిపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన బుధవారం సంగుపాలెం గ్రామంలో ప్రారంభించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జాలాది లోకరాజ్యుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ, పార్టీ నాయకులతో ఇంటింటికి తిరిగి గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కడియాల వరప్రసాదరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు లక్కంరాజు వెంకటపతిరాజు, కనుమూరి సాంబమూర్తిరాజు, క్లస్టర్, మాజీ సొసైటీ అధ్యక్షులు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జాలాది అశోక్, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాశీం, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, టీడీపీ యువ నాయకుడు సయ్యద్ నిజాం, షేక్ మీరా, నిజాంపట్నం నాగరాజు పాల్గొన్నారు.

డాక్టర్ గ్లోరియానేట్ సోపాటిని పరామర్శించిన వేగేశన

పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటిని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వారి గృహానికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల, గ్రామ టీడీపీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనతో కూటమి ముందడుగు : గూడపాటి



16వ వార్డులో ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణాభివృద్ధి కోసం మంత్రి అనగాని ప్రత్యేక దృష్టిసారించి రూ.400 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 4, 5, 13, 16, 23 వార్డుల్లో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ సంవత్సరకాలంలో టీడీపీ చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు తాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని, కూటమి ప్రభుత్వంలో లక్షలాది రూపాయలు వెచ్చించి కొత్త పైప్‌లైన్‌ల నిర్మాణం చేసి మెయిన్ కెనాల్ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా నీటిని తోడేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి వాటర్ ప్లాంట్ షెడ్డును శాశ్వతంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు మేకా రామకృష్ణ, జీవీనాగేశ్వరరావు, ముత్తవరపు తేజ్‌కుమార్, కరేటి కోటి, ఆది ధనుంజయ, నల్లూరు అజయ్‌కుమార్, గోగినేని పట్టాభి రామారావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, ఆగస్య, బొర్రా సూర్యరాజు, బొందలపాటి మల్లికార్జున్‌రావు, గూడవల్లి బాబూరావు, దేవగిరి రవి, ఎం.ఆంజనేయులు, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జంపనిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

వేమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని బీసీ కాలనీలో గురువారం ఉదయం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. 11 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మూడు గ్రామాల్లో...


భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మూడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. భట్టిప్రోలు మండల పరిధిలోని చింతమోటులో మధ్యాహ్నం 3 గంటలకు, పెదలంకలో 4 గంటలకు, పెసర్లంకలో 5 గంటలకు జరిగే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఆనందబాబు పాల్గొంటారని అన్నారు.

నేడు పట్టణంలో మంత్రి అనగాని పర్యటన

రేపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3వ వార్డు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని, ఆ సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారని టీడీపీ సీనియర్ నాయకుడు జీవీ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

● స్వచ్ఛసర్వేక్షణ అధికారి సుధీర్



పోటుమెరకలో సచివాలయాలను పరిశీలిస్తున్న స్వచ్ఛసర్వేక్షణ టీమ్

రేపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బృందం స్వచ్ఛ సర్వేక్షణ అధికారి జీ.సుధీర్ అన్నారు. మండలంలోని పోటుమెరక గ్రామంలో బుధవారం కేంద్ర బృందం స్వచ్ఛసర్వేక్షణ టీమ్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, పాఠశాల ఆవరణ, ఖాళీ ప్రాంతాల్లో మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణాధికారి ఎస్కే సఫియా, ఎంపీడీవో డీవీడీ ప్రసాద్, సర్పంచ్ కాగితాల హనుమ, సెక్రటరీ భీమాబసవయ్య, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరం మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా నాగమణి

నగరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నగరం మండల మహిళా అధ్యక్షురాలిగా మాన్యం నాగమణి నియమితులయ్యారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం ఈనియామకం జరిగిందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసందర్భంగా మండల కార్యాలయంలో చిరుసత్కార కార్యక్రమంలో ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు, ఏపీఎంవోసీసీలు పాల్గొన్నారు. నాగమణి నియామకంపై హర్షం వ్యక్తం చేసిన పార్టీ నాయకులు, మండలంలో మహిళా నేతకు బాధ్యతలు అప్పజెప్పటం సంతోషకరమని, ఇది పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

నగరంలో తూనికల శాఖాధికారుల తనిఖీలు

నగరం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నగరం మండల కేంద్రంలో తూనికల శాఖాధికారుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా వ్యాపార సముదాయాలు, కూరగాయలకు సంబంధించిన తూనికల ఎలక్ట్రానిక్ పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూనికల శాఖాధికారి రాందాస్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో తూనికల పరికరాలను తనిఖీ చేసి ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వినియోగదారులను మోసం చేయకుండా చూడటమే తమ లక్ష్యం అన్నారు.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో శస్త్ర చికిత్సలు ఎక్కువ

అప్రమత్తం చేసిన కుటుంబ ఆరోగ్య సర్వే



అమ్మకు ఆపద

సత్తెనపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే అత్యధిక సిజేరియన్‌లు మన రాష్ట్రంలో జరుగుతున్నాయి. సిజేరియన్లు 42.2 శాతంగా ఉన్నట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలు చెపుతున్నాయి. ఈ తీవ్రతను తగ్గించేలా సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు వైద్యులకు సూచిస్తున్నారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు మండలాల నుంచి నిత్యం గర్భిణీలు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు వచ్చి చికిత్సలు పొందుతుంటారు. నెలకు 120కి పైగా ప్రసవాలు ఆస్పత్రిలో జరుగుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం ఆ ప్రసవాలలో సీజేరియన్‌ల శాతం 25కు మించ కూడదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే 50 వరకు సిజేరియన్‌లు ఉంటున్నాయి. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జనవరి నెలలో 52 సాధారణ ప్రసవాలు, 57 సిజేరియన్‌లు జరిగాయి. ఫిబ్రవరిలో 42 సాధారణ ప్రసవాలు, 51 సిజేరియన్‌లు జరిగాయి. మార్చిలో 57 సాధారణ ప్రసవాలు, 44 సిజేరియన్‌లు జరిగాయి. ఏప్రిల్‌లో 49 సాధారణ ప్రసవాలు, 45 సిజేరియన్‌లు జరిగాయి. మే నెలలో 56 సాధారణ, 49 సిజేరియన్‌లు జరిగాయి. జూన్‌లో నేటి వరకు 71 సాధారణ ప్రసవాలు, 41 సిజేరియన్ జరిగాయి. దీనిని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆరు నెలల్లోనే ఇక్కడ మొత్తం కాన్పుల్లో 50 శాతం వరకు సిజేరియన్‌లు జరిగినట్టు తెలుస్తుంది.

తీవ్ర ప్రభావం

సిజేరియన్ కాన్పు తల్లీ బిడ్డలకు తీవ్ర ప్రభావం చూపుతుంది. శిశువు జన్మించిన గంటలోపే తల్లి ముర్రు పాలు తాగించాలని వైద్యులు చెపుతుంటారు. సిజేరియన్ చేసిన తల్లి స్పృహలోకి రావాలంటే సుమారు ఐదు గంటల సమయం పడుతున్న తరుణంలో ఇది సాధ్యం కాదు. ఇతర ఇబ్బందులు తలెత్తుతుంటాయి. బిడ్డను త్వరిత గతిన అన్నీ తానై తల్లి తేలికగా చూసుకోవాలంటే సాధారణ ప్రసవంతోనే సాధ్యమవుతుంది. గర్భిణీలకు చెందిన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించాల్సి ఉంది. ఆయా మండల్లోని ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు సాధారణ ప్రసవాలపై గర్భిణీలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్య అంశాల గురించి పూర్తిస్థాయిలో వివరించాల్సిన అవసరం ఉంది. ఇకనైనా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తప్పనిసరి పరిస్థితుల్లోనే...

తప్పనిసరి పరిస్థితుల్లోనే ఏరియా వైద్యశాలకు వచ్చే గర్భిణీలకు సిజేరియన్‌లు చేయాల్సి వస్తుందని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. సాధారణ ప్రసవాలను కూడా ఎక్కువగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

-డాక్టర్ లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్

సీటీ శాఖలో జోనల్ ఆర్వోకు గ్రీన్ సిగ్నల్



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

- మంత్రి పయ్యావుల సూత్రపాయ అంగీకారం
- వైసీపీ హయాంలో అడ్డగోలు సంస్కరణలు
- నూతన ఆర్‌వోతో మేలంటోన్న ఉద్యోగులు

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నులశాఖలో జోన్-3లో కొత్తగా రీజనల్ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతోన్నాయి. ఇటీవల కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులతో ఆ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నూతన ఆర్‌వో ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. దీంతో ఆ శాఖ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సంస్కరణల పేరుతో అడ్డగోలుగా రీజనల్ కార్యాలయాలను ఏర్పాటు చేసి ఉద్యోగులను సొంత డివిజన్‌లకు దూరంగా బదిలీ చేయటంపై ఉద్యోగుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. సంస్కరణల పేరుతో రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో రీజనల్ కార్యాలయాల(ఆర్‌వో)ను ఏర్పాటు చేశారు. ఆయా నూతన ఆర్‌వోలకు రాష్టంలోని వేర్వేరు డివిజన్‌ల నుంచి ఉద్యోగులను బదిలీపై సుదూర ప్రాంతాలకు కేటాయించారు. దాంతో గుంటూరు నుంచి తిరుపతి, కడప, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు కూడా వెళ్ళిన ఉద్యోగులున్నారు. రాష్టంలో నాలుగు జోన్‌లు ఉండగా మూడు రీజనల్ కార్యాలయాలను మాత్రమే ఏర్పాటు చేయటంతో అసలు సమస్య వచ్చిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడలో ఆర్‌వో పరిధిలోకి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు వస్తాయి. తాజాగా జోన్ 3లో కూడా కొత్తగా రీజనల్ కార్యాలయం ఏర్పాటు చేస్తే నాలుగు జోన్‌లకు నాలుగు రీజనల్ కార్యాలయాలు ఏర్పాటు చేసి సమతుల్యత పాటించినట్లవు తుందని ఉద్యోగ సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇటీవల పలు సమస్యలపై ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్‌తో భేటీ సందర్భంలో నూతన ఆర్‌వో ఏర్పాటుకు ఆయన అంగీకారం తెలపటంలో వారంతా హర్షం వ్యక్తం చేశారు. అయితే నూతన ఆర్‌వో ఎక్కడ ఏర్పాటు చేస్తారో త్వరలో వెల్లడించనున్నట్లు చెబుతున్నారు.

నూతన ఆర్‌వోతో సొంత డివిజన్‌లకు ఛాన్స్

నూతన రీజనల్ కార్యాలయం ఏర్పాటు చేయనుండటంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జోన్‌ల వారీగా ఆర్‌వో ఏర్పాటు చేయటంతో సమతుల్యత పాటించినట్లవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాంతో ఆర్‌వో ఏర్పాటుతో కొత్తగా అధికారులతో పాటు 25 ఏసీటీవో పోస్టులు, పది డీసీటీవో, కింది స్థాయి సిబ్బంది అవసరమని, ఫలితంగా దూర ప్రాంతాలకు వెళ్ళిన ఉద్యోగులు సొంత డివిజన్‌లకు వచ్చే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నూతన ఆర్‌వోతో అదనపు రెవెన్యూ కూడా కలిసి వస్తుందని చెబుతున్నారు. నిరంతర తనిఖీలతో పాటు ఆడిట్‌లతో ప్రభుత్వానికి అదనపు ఆదాయం కూడా సమకూరే ఛాన్స్ ఉందని తెలిపారు.

నేటి నుంచి ఏఎన్యూ దూరవిద్య పరీక్షలు

రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పెదకాకాని, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ, డిప్లమా, సర్టిఫికెట్ ప్రోగ్రాం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర విద్యా పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య దిట్టకవి రామచంద్రన్ తెలిపారు. పరీక్షలు ఆగస్టు ఏడో తేదీ వరకు కొనసాగుతాయన్నారు. సెమిస్టర్ విధానంతో పాటు, వార్షిక, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:00 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 2 సెషన్లలో పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 114 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా, వర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సజావుగా పరీక్షల నిర్వహణకు ప్రత్యేక పరిశీలకులను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలలో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక స్క్వాడ్ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.

బస్సుల కండీషన్‌లో నిర్లక్ష్యం వద్దు

● మహిళలకు ఉచిత ప్రయాణం సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలి ● ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్

గుంటూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా బస్సులను కండీషన్‌లో ఉంచుకోవాలని, ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం చేయవద్దని నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ నాగేంద్రప్రసాద్ సూచించారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని తిక్కన సమావేశమందిరంలో జోనల్ స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆక్యుపెన్సీని పెంచేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. అనవసర ఖర్చుల భారాన్ని తగ్గించుకోవాలని సూచించారు. డిపోల వారీగా సమీక్షించిన ఆయన త్వరలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. బస్టాండ్‌లలో కూడా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. తాగునీరు, బల్లలు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అలానే కమర్షియల్ రెవెన్యూ పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీపీటీవోలు సీహెచ్ విమల (గుంటూరు), సామ్రాజ్యం (బాపట్ల), జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్, డిపో మేనేజర్లు ఇతర అధికారులున్నారు.

ఇసుక క్వారీలకు.. సింగిల్ టెండర్

అన్ని అనుమతుల బాధ్యత ఏపీసీఆర్‌డీఏదే

ఇసుక కమిటీ ద్వారా ఏజెన్సీకి నగదు చెల్లింపు

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక క్వారీల్లో ఇసుక తొలగింపునకు ఏ జిల్లాకు ఆ జిల్లా కాకుండా సింగిల్ టెండర్ నిర్వహించి ఏజెన్సీని ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇసుక తొలగింపు కోసం రూ. 286.20 కోట్లకు పరిపాలన అనుమతికి కేబినెట్ ఆమోదం తెలిపింది. టెండర్ ప్రక్రియని పర్యవేక్షించేందుకు ఒక కమిటీని నియమిస్తుంది. కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ ప్రకాశం బ్యారేజ్ ముందుభాగంలోని ఇసుక ప్రదేశాలలో పూడిక తొలగింపునకు ఏపీసీఆర్‌డీఏకు అప్పగిస్తారు. పరిశ్రమలు, వాణిజ్య(ఖనిజాలు) శాఖ ద్వారా జలవనరుల శాఖకు బదులుగా ఏపీసీఆర్‌డీఏకి అన్ని అవసరమైన అనుమతులు, క్లియరెన్స్‌లు పొందడానికి అధికారాలు బదలాయిస్తారు. జాతీయ హరిత ట్రిబ్యునల్. నూతన ఇసుక విధానం మార్గదర్శకాలు, సుప్రీం కోర్టు, ఇతర న్యాయస్థానాల ఆదేశాలు, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు, నది సంరక్షణ చట్టం నిబంధనలకు అనుగుణంగా ఇసుక తొలగింపు ద్వారా పొందిన ఇసుక పరిమాణాన్ని ధ్రువీకరించే బాధ్యతని జిల్లా స్థాయి ఇసుక కమిటీకి కేటాయించారు. ఈ కమిటీ ద్వారానే ఏజెన్సీకి చెల్లింపులు చేస్తారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్‌లు పొందడానికి ఏపీసీఆర్‌డీఏ సమన్వయం చేసుకుంటుంది.

అమరావతి రాజధానిలో నిర్మాణ రంగం ఊపందుకోవడంతో భారీ మోతాదులో ఇసుక అవసరం ఏర్పడింది. ఇసుక కోసం ఆ శాఖ ఇప్పటికే గుంటూరు, కృష్ణా జిల్లాలకు ఇండెంట్ కూడా పంపించింది. అయితే అంత మోతాదులో ఇసుక సరఫరా చేయడానికి నిల్వలు లేవని రెండు జిల్లాలు నివేదించాయి. కృష్ణానదిలో పూడిక తీస్తే తప్ప రాజధాని అవసరాలకు సరిపడా ఇసుక లభ్యమయ్యే అవకాశం లేదు. దీనిని పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం ఇసుకకి సంబంధించి కీలక అధికారాలను ఏపీసీఆర్‌డీఏకి బదలాయించడం ద్వారా అమరావతి రాజధానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక లభిస్తుందని చెబుతున్నది. ఇసుక మైనింగ్ ఆపరేషన్స్ మాత్రం యథాతథంగా కొనసాగుతాయి. పర్యవేక్షణ, నిఘా బాధ్యతలు మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల కిందనే ఉంటాయి. ఏజెన్సీ ఏమైనా అక్రమాలకు పాల్పడితే ఇప్పుడున్న నిబంధనల మేరకే చర్యలు తీసుకుంటారు. నదిలో నుంచి ఇసుకని బయటకు తీసి స్టాకు పాయింట్ల వద్దకు చేర్చే బాధ్యత ఏజెన్సీదే. స్టాకు పాయింట్ల వద్ద నుంచి ఇసుక లోడింగ్ ఛార్జీలు వసూలు చేసుకొని ఉచితంగా సరఫరా చేసే వ్యవహారాలు డీఎల్ఎస్‌సీ నిర్ణయం మేరకు తీసుకొంటారు.




ప్రభుత్వాస్పత్రిలో దుస్తులు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ, రమణ యశస్వి

జీజీహెచ్‌లో శిశువులకు దుస్తులు పంపిణీ

సే వాట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శిశు వైద్య విభాగంలోని చిన్నారులు బుధవారం కొత్త దుస్తులు ధరించి మురిసిపోయారు. ఆసుపత్రిలో వైద్యం పొందేందుకు వచ్చిన నాలుగేళ్లలోపు వయస్సు కలిగిన 350 మంది చిన్నారులకు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న రెడిమేడ్ దుస్తులను ఓ స్వచ్ఛంధ సంస్థ ఉచితంగా అందజేసింది. రంగు రంగుల్లో ఆకర్షణీయంగా ఉన్న దుస్తులను తమ బిడ్డలకు తొడిగిన తల్లులు ఆనందంతో మురిసిపోయారు. గుంటూరు జిల్లా ఉండవల్లికి చెందిన ఎస్ మారుతీ వేణుగోపాల్, ఆయన కుమార్తె నీరజ, తమ సే వాట్ స్వచ్ఛంధ సంస్థ తరపున ఈ దుస్తులను చిన్నారులకు అందజేశారు. ఇవన్నీ విదేశాల నుంచి వచ్చిన నాణ్యమైన దుస్తులు కావడం విశేషం. పిల్లలు దానం తీసుకుంటు న్నారనే భావన రాకుండా ఉండేందుకు...నచ్చిన దుస్తులను పిల్లలే ఎంచుకొని తీసుకొనే విధంగా వినూత్నంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ఒకటి నుంచి నాలుగేళ్లలోపు వయస్సు గల అనాధ పిల్లలకు, అవసరమైన పేద పిల్లలకు నూతన దుస్తులు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ సే వాట్ సంస్థను గత ఏడాది స్వయంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించడం విశేషం. వీరి సేవా నిరతిని పవన్ కల్యాణ్ అభినందించారు.

ఏడాదిలో 7350 మంది పిల్లలకు పంపిణీ

గతంలో నీరజ గుంటూరులోని భాష్యం విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రిలో బుధవారం జరిగిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి తన గురువుభాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణను ఆమె ఆహ్వానించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో కలసి భాష్యం రామకృష్ణ, వేణుగోపాలరావు, నీరజ తదితరులు చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. వేణుగోపాలరావు, నీరజ మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పలు ప్రాంతాల్లో 7350 మందికి దుస్తులు అందజేసినట్లు తెలిపారు. భాష్యం రామకృష్ణ, రమణ యశస్వి మాట్లాడుతూ సమాజంలో అనాధ, పేద పిల్లలకు దుస్తులు కొరత ఉందని, దీనిని గుర్తించిన సే వాట్ సంస్థ పిల్లలకు కొత్త బ్రాండెడ్ దుస్తులు అందజేయడం అభినందనీయమన్నారు.

సోలార్.. బాదుడు

మిగులు విద్యుత్ ఇస్తున్నా తప్పని భారం



● ఏడాదిగా చెల్లింపులు నిల్.. వినియోగదారుల ఆగ్రహం ● చార్జీల పేరుతో ప్రతి నెలా రూ.400 నుంచి 500 వసూలు ● పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు 87,936, పూర్తయినవి 1,640

గుంటూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ప్లాంటు పెట్టించుకుంటే నాణ్యమైన విద్యుత్‌తో పాటు బిల్లుల భారం తగ్గుతుంది.. పైగా మిగులు విద్యుత్ ద్వారా ఆర్థిక లబ్ధి జరుగుతోంది.. అని ట్రాన్స్‌కో అధికారులు ప్రచారం చేస్తున్నారు. అయితే పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఇప్పటికే సోలార్ విద్యుత్ బిగించుకున్న వారు బిల్లుల భారంతో అల్లాడుతున్నారు. ఉచిత విద్యుత్ అని భావించిన పలువురు సోలార్ విద్యుత్ వేలల్లో వెచ్చించి ఏర్పాటు చేసుకున్నారు. ఒకసారి పెట్టుబడి పెడితే ఇక పాతికేళ్ల విద్యుత్ భారం ఉండదని భావించి పలువురు ముందుకు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం కూడా పీఎం సూర్యఘర్ పేరుతో భారీగా రాయితీలు ప్రకటించడంతో అప్పులు చేసి సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. తీరా నెల తిరిగేసరికి వచ్చే కరెంటు బిల్లును చూసి మోసపోయామని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌కు ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం మాటేమోగానీ.. ప్రతి నెలా చార్జీల రూపంలో వందల్లో కాజేస్తోందని వాపోతున్నారు. ఈ పరిణామాలతో పీఎం సూర్యఘర్ స్కీము అబాసుపాలవుతోంది. గుంటూరు జిల్లాలో ఈ ఏడాది మే నాటికి 87,936 రిజిస్ట్రేషన్లు జరగ్గా 1,640 మంది మాత్రమే సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ఒక్కో కిలోవాట్‌కు రూ.75 వేల వరకూ ఖర్చవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలను మోయలేక కొంతమంది, కేంద్రం ప్రకటించిన భారీ రాయితీలు ఆశాజనకంగా ఉండడంతో మరి కొందరు సోలార్ వైపు మొగ్గు చూపారు. కరెంటు బిల్లుకు కట్టే డబ్బులేవో ప్రతి నెలా బ్యాంకుల్లో ఈఎంఐ కట్టుకోవచ్చని అనేక మంది రుణాలు తీసుకుని సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే రుణాలకు ఈఎంఐ తోడు వారికి ఇప్పుడు ప్రతి నెలా రూ.400 నుంచి 500 వరకూ కరెంటు బిల్లు కట్టాల్సి రావడంతో వారంతా లబోదిబోమంటున్నారు.

వినియోగం లేకపోయినా వసూళ్లు..

సోలార్ ప్లాంట్లు పెట్టుకుని ప్రతి రోజూ విద్యుత్‌ను తయారు చేసుకుని తమ విద్యుత్ తామే వాడుకుంటున్న వారిపై ట్రాన్స్‌కో చార్జీల రూపంలో బాదేస్తోంది. ప్రతి నెలా 100 నుంచి 200 యూనిట్ల విద్యుత్‌ను ఇస్తున్న వినియోగదారులపై కస్టమర్, గ్రిడ్ చార్జీల రూపంలో రూ.300 నుంచి 350 వరకు బిల్లులు కట్టాల్సి వస్తోంది. అదే ట్రాన్స్‌కో విద్యుత్ పది యూనిట్లు వాడుకున్నా బిల్లు 400 నుంచి 500 వందలకు పెరిగిపోతోంది. విద్యుత్ వినియోగం సున్నా ఉంటే స్థిర చార్జీలు రూ.30, కస్టమర్ చార్జీలు రూ.30 నుంచి 50, విద్యుత్ సుంకం రూ.1.86, సర్‌చార్జి 25, గ్రిడ్ చార్జీలు కిలోవాట్‌కు రూ.15 చొప్పున, ఒకరకం ఎఫ్‌పీపీసీ చార్జీలు రూ.144, రెండో రకం ఎఫ్‌పీపీసీఏ చార్జిలు రూ.79, కొత్తగా పెట్టించుకున్నవారికి మూడో రకం ఎఫ్‌పీపీసీఏ చార్జీలు మరో రూ.100 అదనంగా కట్టాల్సి వస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు శూన్యం..

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్, సోలార్ విద్యుత్‌పై విస్తృతంగా ప్రచారం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది చివరినాటికి 15 లక్షల కుటుంబాలకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అందులోభాగంగా కేంద్రం ఇచ్చే రాయితీలకు తోడు అదనంగా రాయితీలు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద ప్రస్తుతం ఒక కిలో వాట్ సోలార్ ప్లాంటుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకైతే రూ.60 వేలు, మూడు కిలోవాట్లకైతే రూ.78వేలు చొప్పున భారీ సబ్సిడీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు రెండు కిలోవాట్ల సోలార్ ప్లాంటును ఉచితంగా ఏర్పాటు చేస్తానని చెబుతోంది. అదే సమయంలో బీసీలకు మూడు కిలోవాట్లకు కేంద్రం ఇచ్చే రూ.78 వేల రాయితీతోపాటు మరో 20 వేలు అదనంగా ఇస్తానని చెబుతోంది. ఆ ప్రకారం భారీగా పీఎం సూర్యఘర్ కోసం రిజిస్ట్రేషన్లు చేస్తోంది. అయితే ఆచరణలో ఒక్క ప్లాంటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు సహాయం అందలేదు. ఈ పరిస్థితుల్లో గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకూ 87,936 రిజిస్ట్రేషన్లు జరగ్గా పీఎం సూర్యఘర్ 1,640 మంది మాత్రమే సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. కిందటేడాది జూన్ నాటికి ఈ సంఖ్య 917గా ఉంది. అంటే ఏడాది కాలంలో జిల్లాలో 723 మంది మాత్రమే సోలార్ ప్లాంట్లు పెట్టించుకున్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో సోలార్ ప్లాంట్ల సంఖ్య 1000 కంటే తక్కువగా ఉంది. దీనిని బట్టి సోలార్ విద్యుత్ పట్ల ప్రజల్లో ఎంతటి విముఖత వ్యక్తమవుతోందో ఊహించవచ్చు.

● మిగులు విద్యుత్తుకు చెల్లింపులు ఎక్కడ?

పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారులు 'ఆన్ గ్రిడ్' పద్ధతిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఆన్ గ్రిడ్ అంటే.. సోలార్ ద్వారా తయారైన విద్యుత్ గ్రిడ్‌కు వెళ్లిపోతుంది. గ్రిడ్ ద్వారా వచ్చే విద్యుత్‌ను వినియోగదారుడు వాడుకుంటాడు. ఈ రెండింటినీ లెక్కగట్టి బిల్లు వేస్తారు. వినియోగదారుడు వాడుకున్న విద్యుత్ కంటే, ఉత్పత్తి చేసిన విద్యుత్తు ఎక్కువగా ఉంటే దాన్ని మిగులు విద్యుత్‌గా ప్రకటించి దానికి నగదు చెల్లిస్తారు. గతంలో యూనిట్‌కు రూ.4.17గా ధర నిర్ణయించగా, తాజాగా కూటమి ప్రభుత్వం దాన్ని రూ.2.09 పైసలకు తగ్గించింది. అయితే ఆ డబ్బులు కూడా వినియోగదారులకు చెల్లించడం లేదు. ఏటా జూన్, డిసెంబరులో లెక్కచూసి వినియోగదారుడికి నగదు చెల్లించాలి. అయితే సోలార్ ప్లాంటు పెట్టుకుని ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ మిగులు విద్యుత్ లెక్కలు వేయకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

ప్లాస్టిక్ కొంటారు.. పైసలిస్తారు

● స్వచ్ఛ రథం పేరుతో కొత్త కార్యక్రమానికి శ్రీకారం ● గుంటూరు రూరల్ మండలంలో ప్రయోగం

గుంటూరు సిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఇంట్లో పనికి రాకుండా ఉండే ప్లాస్టిక్ డబ్బాలు.. పేపర్లు కొంటానికి ఎవరు వస్తారా.. అని ఇంక ఎదురు చూసే అవసరం లేదు. వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి పైసలు చెల్లించే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, కమిషనర్ కృష్ణ తేజ అత్యంత ప్రీతి పాత్రంగా రూపొందించిన ఈ కార్యక్రమం పేరు స్వచ్ఛ రథం. దాని అమలుకు గుంటూరు రూరల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గురువారం గుంటూరు రూరల్ మండలంలోని లాల్‌పురంలో ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతి బసు, డీపీఓ బీవీఎస్ సాయికుమార్ స్వచ్ఛ రథం కార్యక్రమం ప్రారంభిస్తారు. నూతనంగా ప్రారంభించనున్న స్వచ్ఛ రథం కార్యక్రమంలో ప్లాస్టిక్ బాటిల్లు, న్యూస్ పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు, పుస్తకాలు, పాల ప్యాకెట్ల కవర్లు, అట్టలు, ప్యాకింగ్ కవర్లు, నూనె డబ్బాలు, గాజు సీసాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థములు కంప్యూటర్లు, కీబోర్డులు, క్లాప్ మిత్రా ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. అందుకు గాను ఇంట్లోకి అవసరం అయిన నిత్యావసర వస్తువులను అందజేస్తారు. చెత్త నుంచి సంపద సృష్టి అనే కాన్సెప్ట్‌తో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు సీఈఓ జ్యోతి బసు తెలిపారు.



నూతనంగా ఆరంభించనున్న స్వచ్ఛ రథం



నాడు అధ్వానంగా ఉన్న రహదారి నేడు అందంగా రూపుదిద్దుకొని..

ఎమ్మెల్యే చొరవతో రహదారి నిర్మాణం

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజలు రహదారులు లేక అవస్థలు పడుతున్న నేపథ్యంలో స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య ప్రత్యేక చొరవతో రాజమార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలోనే మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీ దుర్గా నగర్‌లో సుమారు 30 సంవత్సరాలుగా అంతర్గత రహదారులు లేక ప్రజలు నానా యాతన పడుతున్నారు. దీంతో గ్రామస్థులు ఇటీవల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే రూ.9.50 లక్షల పంచాయతీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

మద్దిపాడు, జూలై9(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం మద్దిపాడులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా ఆసుపత్రిలోని అన్ని గదులను, ఎన్టీఆర్ వైద్య సేవ కౌంటర్‌ను, ఓపీలను, అత్యవసర సేవా విభాగాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో ఉద్యోగ సిబ్బంది జాబ్‌చార్టును అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రసవాలకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించి అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు వచ్చిన రోగులతో మాట్లాడారు. వైద్యసేవల గురించి ఆరా తీయగా సక్రమంగానే అందుతున్నట్లు రోగులు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి, డాక్టర్ అన్వేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు ముగిసిన శిక్షణ

ఒంగోలు (రూరల్), జూలై9(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎన్టీఆర్ కళాపరిషత్‌లో బుధవారం ఎన్నికల జాబితా నిర్వహణపై 50మంది బీఎల్‌వోలకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ సమయంలో బీఎల్‌వోలు బాధ్యతగా వ్యవహరించటం ఎంతో అవసరమన్నారు. అదేవిధంగా 18సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకులకు ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పక ఆచరించాలన్నారు.

● పొన్నలూరు: ఓటరు జాబితాల నిర్వహణపై మండలంలోని బూత్‌లెవల్ అధికారులకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. కొండపి ఎలక్ట్రోరల్ అధికారి ఏ.కుమార్, తహసీల్దార్ పుల్లారావు శిక్షకులుగా వ్యవహరించారు.

తల్లికి వందనం.... గందరగోళం!

(5వ పేజీ తరువాయి)

డబ్బులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయడానికి కసరత్తు చేస్తోంది. కానీ ఈ విషయంలో తల్లుల అనుమానాలను తీర్చడంలో విద్యాశాఖ నిర్లక్ష్యం వహించడంతో తమ ఖాతాల్లో డబ్బులు పడలేదన్న హైరానా వారిలో వ్యక్తమవుతోంది

ఎస్సీ విద్యార్థుల విషయంలోనూ అంతే...

తల్లికి వందనం నిధుల విడుదల సమయంలో కొంతమంది ఎస్సీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,900 మాత్రమే జమ అయినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. నిజానికి ప్రభుత్వం నిధుల విడుదల సమయంలోనే ఈ విషయంపై స్పష్టత ఇచ్చింది. స్వల్పమొత్తంలో కార్పొరేషన్ నిధులను దీనికి అనుసంధానం చేశామని, ఎవరికైనా డబ్బుల్లో కోత పడితే, అందులో నిధులు జమ కాగానే ఖాతాల్లో ఆటోమేటిక్‌గా పడతాయని తెలిపింది. కానీ ఈ విషయంపై సదరు లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలోనూ మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఆ డబ్బుల విషయంలో తల్లులు గందరగోళ పడుతుండగా, ప్రభుత్వం ఆ డబ్బులను స్వాహా చేసిందనే ప్రచారం కూడా బయట పెద్దఎత్తున జరుగుతోంది. పథకానికి సంబంధించి డబ్బుల జమ విషయంలో విద్యాశాఖ వైపు నుంచి ఇప్పటి వరకు ఓ ప్రకటన జారీకాకపోవడం ఒక ఎత్తయితే అపోహల నివృత్తికి తీసుకున్న చర్యలేంటనే దానికి వారి వద్ద సమాధానమే లేదు

అర్హత ఉన్నా అందలేదని 1,207 మంది తల్లులు

తల్లికి వందనం పథకానికి సంబంధించి అన్ని అర్హతలున్నా తమ ఖాతాల్లో డబ్బులు పడలేదని జిల్లా వ్యాప్తంగా 1207 మంది తల్లులు పీజీఆర్ఎస్(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్) గడప తొక్కారు. ఇందులో 831 మంది అర్జీలు సహేతుకమైనవిగా గుర్తించి అధికారులు స్వీకరించారు. 229 మందిని అర్హులుగా గుర్తించినట్లు సమాచారం. మిగిలిన వారి విషయంలో గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేపట్టిన వెబ్‌ల్యాండ్ డేటా వారి పాలిట శాపంగా మారినట్లు తెలుస్తోంది. కేవలం పీజీఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఇదే కాగా సచివాలయాల వారీగా భారీగా తల్లికి వందనం దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. పథకం అమలు జరిగి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు జిల్లాలో అర్హత ఉండి ఈ కేవైసీతో పాటు తల్లిమరణం, లేదా విద్యార్థి మృతి వంటి కారణాలతో ప్రభుత్వం నిధుల జమ చేయని వారు ఉన్నారు. ఈ కేవైసీ విషయంలో ఉన్న సాంకేతిక చిక్కులు తొలగించుకున్న వారికి త్వరలోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. అధిక భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఉండడం, ఆదాయపుపన్ను, ఫోర్ వీలర్ ఉండడం వంటి కారణాలతో పథకానికి అనర్హులుగా మారిన వారు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గత ప్రభుత్వ తప్పిదాలతో పథకానికి దూరమైన వారు ఉన్నారు

డేటా విషయంలో నిర్లక్ష్యమే...

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తల్లికి వందనం నిధులు డబ్బులను పెద్ద ఎత్తున తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఇంతటి కీలకమైన పథకం డేటా విషయంలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వహించడం విమర్శలకు తావిస్తోంది. పైగా పథకం అమలు తీరుతెన్నులపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాలన్న స్పృహే కరువైంది. డబ్బులు విడుదల చేసి నెల కావొస్తుండడం ఒక ఎత్తయితే మలి విడత తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. కానీ ఇప్పటి వరకు జిల్లాల్లో అర్హత ఉండి పథకానికి దూరమయిన వారి సంఖ్య, అనర్హులుగా ప్రభుత్వం తేల్చిన వారి సంఖ్య కచ్చితత్వంతో అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. పైగా విద్యాశాఖ, సచివాలయ విభాగాలు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారే తప్ప పథకం లోపాలపై దృష్టిపెట్టడం, తల్లుల్లో ఉన్న గందరగోళానికి తెరదించుదామనే ప్రయత్నం జరగకపోవడం విస్మయం కలిగిస్తోంది. సచివాలయాల వారీగా జాబితా ప్రదర్శించామని చెబుతున్నప్పటికి అది కూడా ప్రహసనంలాగానే నడిచింది తప్ప చిత్తశుద్ధి కొరవడిందనే వ్యాఖ్యలు తల్లుల నుంచి వినిపిస్తున్నాయి

రోడ్డు ప్రమాదంలో సీఆర్పీ దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్పీ (ఇన్‌సెట్లో) మోషే ఫైల్

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని వెంకటాపురం వద్ద మంగళవారం రాత్రి ముందు వెళ్తున్న మోటార్‌బైక్‌ను వెనుక వస్తున్న వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి అక్కడి అక్కడే దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. పంగులూరు మండలం రేణంగివరంకు చెందిన సీఆర్పీ మట్టకొయ్య మోషే (37), తంగిరాల సంతోష్‌కుమార్‌లు మోటర్‌బైక్‌పై మేదరమెట్ల వైపు నుంచి రేణంగివరం వెళ్తుండగా వెంకటాపురం వద్ద అదే రోడ్డులో వెనుక వస్తున్న తుపాన్ వాహనం మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోషే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న సంతోష్‌కుమార్‌కు గాయాలు కాగా వైద్యశాలకు తరలించారు.సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేణంగివరంలో విషాదం

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి):పంగులూరు మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న మట్టకొయ్య మోషే (37) మంగళవారం అర్ధరాత్రి 16వ నెంబరు జాతీయ రహదారిపై వెంకటాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన స్వగ్రామం రేణంగివరంలో విషాదం నెలకొంది. మోషే13 ఏళ్లుగా పంగులూరు మండలంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య నాగేశ్వరమ్మతో పాటు విమోచన (9), కీర్తన (8), సుప్రియ(2) ఉన్నారు. పంగులూరు, కొరిశపాడు మండలాల విద్యాధికారులు కె.నాగభూషణం, జి.వీరాంజనేయులు, లాలం పున్నయ్య, సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు రమేష్‌తో పాటు సహచర సీఆర్పీలు, మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన మోషే భార్యకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సంఘప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రారండోయ్

భారీ ఈవెంట్‌గా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

గిన్నిస్ బుక్ అవార్డు సాధనే లక్ష్యం

నేడు అన్ని పాఠశాలల్లో పండుగలా కార్యక్రమం

పనుల్లో తలమునకలైన ఉపాధ్యాయులు

మార్గదర్శకాలు జారీ చేసిన ఉన్నతాధికారులు

జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఒక మెగా ఈవెంట్‌ను తలపిస్తోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం తరహాలో ఈ మెగా పీటీఎంను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిష్ఠాత్మకమైన గిన్నిస్ బుక్ అవార్డు సాధనే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లను భారీగా చేస్తున్నారు. గత వారం రోజులుగా కార్యక్రమ పనులలోనే ఉపాధ్యాయులు, విద్యార్థులు తలమునకలవుతున్నారు. పీటీఎంకు ఏర్పాట్లు ఎలా చేయాలో పాఠశాల విద్యా డైరెక్టర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌లు ప్రతిరోజు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఏర్పాట్లలో టీచర్లను చేయిపట్టి నడిపిస్తున్నారు.

ఒంగోలు విద్య, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)ను పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమగ్ర చర్యలు తీసుకున్నారు. ఈ పీటీఎం నిర్వహణకు సంబంధించి పాఠశాలల్లో సాక్షులను నియమించి వారి సంతకాలతో నివేదికలు, ఫొటోలు లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. ఏ విషయంలో కూడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల ముఖద్వారాలకు మామిడి తోరణాలు, భవన పిల్లర్లకు కొబ్బరి ఆకులు, అరటి బోదెలు, చుట్టూ ఒక శుభకార్యం జరుగుతుందన్న భావన కల్పిస్తున్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ పీటీఎం నిర్వహణకు సంబంధించి కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

ఈ మెగా పీటీఎంకు హాజరుకావాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామ స్థాయి నాయకులకు, ఎస్ఎంసీ కమిటీలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు హెచ్ఎంలు, టీచర్లు స్వయంగా ఆహ్వానిస్తున్నారు. అందుకు సంబంధించి గత నెలరోజులుగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ పీటీఎంకు హాజరుకావాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అన్ని పాఠశాలల్లో సమావేశాలు ఘనంగా జరగనున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి వారి తరగతి గదిలో కూర్చోవాలి. అతిథులు, దాతలు, షైనింగ్ స్టార్ అవార్డు గ్రహీతలు, పూర్వ విద్యార్థులు హెచ్ఎం గదిలో కూర్చోవాలి. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డులు అందజేయాలి. తల్లిదండ్రులకు తమ పిల్లల విద్యాప్రగతిని వివరించాలి. సమావేశంలో విద్యార్థులు ఏమి మాట్లాడాలి, తల్లిదండ్రులు ఏమి మాట్లాడాలో ముందుగానే వారిని సమగ్రంగా సిద్ధం చేయాలి. విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా పూర్వ విద్యార్థులు షైనింగ్ స్టార్స్ ప్రసంగాలు ఏర్పాటు చేయాలి. 4వ తరగతి నుంచి 10వతరగతి చదువుతున్న విద్యార్థుల తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం కింద మొక్క నాటాలి. అందుకోసం జిల్లావ్యాప్తంగా 1.96లక్షల మొక్కలు అందించనున్నారు.

తల్లిదండ్రులకు పోటీలు

మెగా పీటీఎంల సందర్భంగా తల్లిదండ్రుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు వారికి పోటీలు నిర్వహించాలి. తల్లులకు రంగవల్లులు, నిమ్మకాయ పోటీలు, మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహిచాలి. తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించాలి. పిల్లలతో తల్లులకు వందనం పాదాభినందనం, పుష్పార్చన చేయించాలి. ఈ పోటీలను ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించాలి.

మధ్యాహ్న భోజనం మెనూ ఇదీ

మెగా పీటీఎం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అతిథులు, టీచర్లందరూ సహపంక్తి భోజనం చేయాలి. అందుకోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనానికి ప్రభుత్వం ప్రత్యేక మెనూ ప్రకటించింది. వెజిటబుల్ రైస్ పలావ్, అలుకుర్మా, ఉడికించిన గుడ్లు, రాగిజావతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి. భోజనం తీసుకున్న వారి వివరాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలు తీయాలి. ఈ కార్యక్రమం మొత్తానికి సంబంధించి మూడు మంచి ఫొటోలు, 30 సెకన్ల నిడివిగల వీడియోను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

ఏఎంసీ ఛైర్మన్ పదవి రిజర్వేషన్ మార్పు

దర్శి, జూలై 9(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి రిజర్వేషన్ మార్పు జరగటంతో అయోమయం నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల క్రితం రిజర్వేషన్లు ప్రకటించారు. ఆ జాబితాలో దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి జనరల్ మహిళ కేటగిరికి కేటాయించారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. దర్శి పట్టణానికి చెందిన దార నాగవేణిని ఛైర్మన్‌గా నియమించాలని అధిష్ఠానానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర పెద్దలు కూడా ఆ ప్రతిపాదనలు ఖరారు చేసి జాబితాను విడుదల చేశారు. దీంతో దారం నాగవేణికి ఏఎంసీ ఛైర్మన్ పదవి ఖరారైనట్లు అందరూ భావించారు. తాజాగా ఛైర్మన్ పదవిని ఎస్సీ జనరల్‌కు కేటాయిస్తూ మార్కెట్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడటంతో టీడీపీ కూటమి క్యాడర్‌లో, ప్రజల్లో అయోమయం నెలకొంది. తొలుత ప్రకటించిన జాబితాను మార్చి ఇప్పుడు రిజర్వేషన్లు మార్చటంతో గందరగోళ పరిస్థితి నెలకొంటుందని క్యాడర్ ఆందోళన చెందుతోంది.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


వెలిగండ్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండలం లోని ఇమ్మడిచెరువు సచివాలయాన్ని ఆయన ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి ఒక్కరే ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. హాజరు పట్టీలో రోజువారీ సంతకాలు లేవని గుర్తించి ఉన్నతాధికారులతో మాట్లాడి వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ఉద్యోగ స్తులు ఈవిధంగా చేయడం సరికాదన్నారు. అనం తరం ఇమ్మడిచెరువు జడ్పీ హైస్కూల్‌లో ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులను సన్మానించి నగదు ప్రోత్సాహం అందజేశారు. పాఠశాలలో బీసీ హాస్టల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పా ల్గొన్నారు.

గన్నవరం బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

మండలంలోని గన్నవరం గ్రామస్థులకు ఎన్నికల్లో ఇచ్చిన హా మీ మేరకు ఆగిఉన్న బ్రిడ్జి నిర్మా ణానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర రూ.2.20కోట్ల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించా రు. బుధవారం ఆయన పనుల ను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఎం ఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, పా ర్టీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, చౌడారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే దామచర్ల



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని 30, 32వ డివిజన్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకోగా కొందరు పింఛన్లు, ఇంటి స్థలాలు, రేషన్‌కార్డుల లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయా డివిజన్లలోని సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వాటిని సత్వరమే పరిష్కరించాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. తాను కూడా డివిజన్‌లలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి, అవసరమైన పథకాలు అందరికీ చేయాలన్నదే లక్ష్యమన్నారు. పేదరికం లేని సమాజ స్థాపన కోసం ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేస్తుందని వివరించారు. గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఇంట్లో ఒక పిల్లవాడికే డబ్బులు ఇవ్వగా నేడు తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.13వేలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. అలాగే ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, పింఛన్లు పెంపు తదితర పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల కోసం అర్హులు తమ దరఖాస్తులను సచివాలయంలో అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కె. వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు నత్తల కనకరావు, నత్తల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ తూము సుబ్బారావు, కంకణాల వెంకట్రావు, ఆరిగ శంకర్, ఆరిగ శైలజ పాల్గొన్నారు.



చందలూరులో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంటల బీమా నమోదు చేసుకోండి

● ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్‌లో సాగు చేపట్టిన పంటలకు తగిన ప్రీమియం చెల్లించి బీమా చేయించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. (ఎకరా) వరికి రూ.800 లు, మిరపకు రూ. 1200లు, కంది, మినుముకు రూ. 400 ప్రీమియం చెల్లించాలన్నారు. పత్తి పంటకు వాతావరణ ఆధారిత బీమా పొందేందుకు 1900 రూపాయలు చెల్లించాలని తెలిపారు. కౌలు రైతులు తగిన గుర్తింపు కార్డు కలిగి ఉంటేనే ప్రభుత్వ రాయితీలు పొందగలుగుతారని తెలిపారు. రైతులు పొగాకు సాగు చేపట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీప్రియ, స్థానిక నేతలు మురకొండ సుబ్బారావు, పి.వేణు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా ఎరువుల సరఫరా

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి గ్రామంలో పీఏసీఎస్ ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేసే విధంగా చర్యలు చేపడతామని మార్టూరు ఏడీఏ కె. సుదర్శన్ రాజు అన్నారు. బుధవారం కోలలపూడి గ్రామంలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి వ్యవసాయ అధికారిణి లావణ్య అధ్యక్షత వహించారు. తరువాత సమావేశంలో సుదర్శన్‌రాజు మాట్లాడుతూ రెండవ వారం నుంచి పంట నమోదు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాటి నాగార్జున,వీఏఏ గోపికిరణ్, తదితర రైతులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు, చీరలు బహూకరిస్తున్న వ్యాపారవేత్త

వృద్ధులను ఆదుకోవడం బాధ్యత

పర్చూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నిరాదరణకు గురైన వృద్ధులను ఆదుకోవటం బాధ్యతగా గుర్తించాలని వ్యాపార వేత్త తులసి భువనేశ్వరరావు అన్నారు. శ్రీ కృష్ణ చామండేశ్వరి మహర్షి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పర్చూరులోని వృద్ధాశ్రమాల్లో బుధవారం వృద్ధులకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బాలికల పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, కొల్లా రాజేశ్వరరావు(రాజా), కంచనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి):స్థానిక వెంకయ్య ఆశ్రమంలో గ్రానైట్ పరిశ్రమ యజమాని పొత్తూరి వెంకట శివరావు కుటుంసభ్యులు బుధవారం పేద లకు,వృద్ధులకు అన్నదానం చేసి,వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అంతేగాకుండా ఆశ్రమ నిర్వాహకులు శివరాజేష్,అంజలి దంపతులకు కూడా నూతన వస్త్రాలను అందజేశారు. అలాగే ఆశ్రమం అభివృద్ధికి సహాయ సహకారాలను అందిస్తానని వెంకట శివరావు తెలిపారు.

నేడు గురుపౌర్ణమి ప్రత్యేక పూజలు

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకస్వామి సర్వేపల్లి దివ్యరూపాచారి తెలిపారు. ఉదయం హారతి, పంచామృతాభిషేకం, చతుర్వేద పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త యామిని నాగేశ్వరరావు, లక్ష్మీకాంతం దంపతులు తెలిపారు.

13న బల్లికురవలో ఉచిత మెగా వైద్య శిబిరం

బల్లికురవ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 13 వ తేదీన నర్సారావుపేట తేజ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల అధినేత డాక్టర్ బొట్ల రఘుప్రసాద్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల సాధారణ వ్యాధులకు, అలాగే స్త్రీల వ్యాధుల నిపుణుల పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రావినూతల గంగమ్మగుడిలో చోరీ

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతలలో పురాతనమైన గంగమ్మగుడిలో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి గంగమ్మ గుడిలో దొంగలు ప్రవేశించి అక్కడ ఉన్న సీసీ కెమెరాలు,హార్డ్ డిస్క్, అమ్మవారి మెడలోని నాలుగు తాళిబొట్టులను దొంగలు ఎత్తుకు వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఊరి నడిబోడ్డులో ఉన్న గంగమ్మ గుడిలో చోరీ జరగడం పట్ల గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. క్లూస్ టీం గంగమ్మ తల్లి గుడి వద్దకు వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించింది. అక్కడ ఉన్న వేలిముద్రలను సేకరించారు.కొరిశపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మేదరమెట్లకు మంత్రి రవికుమార్

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె. వెంకట మురళిలు హాజరు అవుతున్నారు. గురువారం ఉదయం 11 గంటలు మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొంటారు.

ఓటరు జాబితాల స్వచ్ఛీకరణకు చర్యలు

చీమకుర్తి, జూలై9(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని రాజకీయపార్టీల ప్రతినిధులు, తహసీల్దార్‌లతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వరకుమార్ సమావేశమయ్యారు. ఓటర్ల సవరణ, నూతన ఓటర్లు చేరికలు, అర్హత లేనివారివి తొలగింపులు తదితరాలకు పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ పక్కాగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఐసీని పరిరక్షించుకోవాలి

ఒంగోలు(రూరల్), జూలై9(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని ఐసీఈయూ కార్యదర్శి పారా శ్రీనివాసరావు కో రారు. సార్వత్రికసమ్మెలో భాగంగా బుధవారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగులు, ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. దానిని కాపాడుకోవటానికి ఎలాంటి ఉద్యమాలకు, త్యాగాలకు వెనుకాడబోమని చెప్పారు.

అవీ.. ఇవీ



జార్లపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సింగయ్య

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

అద్దంకిటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జార్లపాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో బత్తిన సింగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉండాల్సిన చిన్నారులలో కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. ఆ ఉన్న నలుగురు చిన్నారులకు పాలు గుడ్లు వంటివి ఇవ్వలేదని గుర్తించారు. చిన్నారులు కూర్చోడానికి ఇచ్చిన కార్పెట్‌ను వాడకపోవడం, ఇతర లోపాలను ఎంపీడీవో గుర్తించారు. వెంటనే సీడీపీవోకు ఫోన్ చేసి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై దృష్టిపెట్టి వాటిని సక్రమంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. కేంద్రాలలో చిన్నారుల హాజరు, వారికి ఇవ్వాల్సిన పోష్టికాహారంలోను, కల్పించాల్సి వసతుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కొండమూరులో డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాలి

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నివాస ప్రాంతాలతో పాటు పబ్లిక్ ప్రదేశాల నుంచి నిత్యం తడి,పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి సూచించారు. బుధవారం మండలంలోని జనకవరం, కొండమూరు గ్రామాలలో చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్‌లకు తరలింపు ప్రక్రియను స్థానిక సిబ్బందితో కలసి పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లకు తరలించిన చెత్తను తడి, పొడిగా వేరుచేసి ప్రాసెసింగ్ చేయాలని అన్నారు. చెత్తను ఎరువుగా మలిచేందుకు వానపాములు వినియోగించాలన్నారు. గ్రామాలలో వీధుల పక్కన, ప్రభుత్వ స్థలాలలో చెత్తకుప్పలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జునరావు, అనిల్‌కుమార్, రాంబాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి మహిళలు

వైసీపీనేతలది బుద్ధిహీన స్వభావం

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఓటమి పాలై ఇంటికే పరిమితమైన వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని, మహిళలపై అభాండాలు వేయడం ఆపార్టీ బుద్ధిహీన స్వభావం అని పలువురు కూటమి మహిళలు పేర్కొన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ వ్యక్తిగత దూషణలను నిరసిస్తూ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణిపై వైసీపీ నేతలు దుర్మార్గం మాట్లాడిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అలాగే కొంతకాలం క్రితం అమరావతి మహిళలపై మాట్లాడిన తీరును వివరించారు. తాజాగా కోవూరు శాసనసభ్యురాలిపై మాట్లాడిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, తదితర మహిళలు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మల రామానాయుడితో మాట్లాడుతున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

ఎత్తిపోతల అభివృద్ధికి సహకరించండి

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఉన్న మూడు ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కొండయ్య జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. బుధవారం మర్యాదపూర్వకంగా సచివాలయంలో మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. ఈసందర్భంగా ఖరీఫ్‌లో సాగుకు సంబంధించిన సమస్యలపై మంత్రికి వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నేడు పంగులూరులో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం పంగులూరులో పర్యటించనున్నారు. 10వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పరిశీలించనున్నారు.

నేడు మండల సమావేశం

పంగులూరు మండల పరిషత్ సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సంబంధిత ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

పర్చూరును అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

వర్క్‌షాపులో ఎమ్మెల్యే ఏలూరి మార్గదర్శకులుగా ముగ్గురి ఎంపిక

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి): పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలపాలన్నదే ప్రగతి విజన్ 2047 లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అన్నారు.బుధవారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా పీ4,పర్చూరు ప్రగతి విజన్‌పై వివిధ శాఖల అధికారులతో వర్క్‌షాపు ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో స్వర్ణాంధ్ర విజన్‌కు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. పీ 4 తో రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు.అదేవిధంగా నియోజకవర్గంలో పేదకుటుంబాలవారికి సాయం చేసేందుకు పిఫోర్ లో భాగంగా కొల్లా అశోక్, వెంకట్, స్వర్ణ బాలు లను మార్గదర్శకులుగా ఎంపిక చేశామని, వారు పేదవారికి సాయం చేసేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు .పీ ఫోర్ లో భాగంగా ఒక్కో మండలానికి 10 మంది చొప్పున 6 మండలాల్లో 60 మందికి సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ పొగాకు రైతుల దగ్గర నుంచి ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయించడంలో ఎమ్మెల్యే ఏలూరి కృషిని రైతులు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. మరో ముఖ్య అతిథి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి చేపట్టిన అభివృద్ధి పథకాలు ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి, డీఎం మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, ఆరు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి, పక్కన మారి టైం బోర్డు చైర్మన్ సత్య, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టరు పెద్దపూడి విజయకుమార్

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పర్యావరణాన్ని కాపాడుకుంటే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకున్నట్లేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని రాజుగారిపాలెం గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని పొలాల్లో ఉపాధి హామీ పథకం క్రింద గ్రామానికి మంజూరయిన కొబ్బరి మొక్కలను ఎమ్మెల్యే ఏలూరి గ్రామ నాయకులతో కలిసి నాటారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు, చింతలపూడి శ్రీనివాసరావు,ఉప్పలపాటి అచ్చిరాజు,కొల్లె పల్లి శ్రీనివాసరాజు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

భవనాసి చెరువు కట్ట మట్టి అక్రమ తరలింపు

పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



గ్రావెల్ తవ్వకాలతో కాలువ కట్ట స్థానంలో ఏర్పడ్డ గొయ్యి (ఇన్‌సెట్లో) పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి

అద్దంకి,జూలై9(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ నది నుంచి భవనాసి చెరువు కు వచ్చే కాలువ కట్టల గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలిస్తుండటంతో కట్టలు కనుమరుగు అయ్యాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నేతలు కాలువ కట్టల మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతలు కూడా అదే దారిన నడుస్తుండటంతో కట్టలు పూర్తిగా కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంది. కాలువ కట్టల మట్టితో పాటు ఆ ప్రాంతంలో మరింత లోతుగా తవ్వుతుండటంతో కట్ట ప్రాంతం కాలువను తలపించేలా మారుతుందని పలువురు విమర్శిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి బుధవారం గ్రావెల్ తరలించిన ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ నారాయణస్వామి తెలిపారు. అదే విధంగా భవనాసి చెరువు అలుగు వాగులో కూడా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్‌లపై కార్మికుల నిరసన

పలు చోట్ల ర్యాలీలు, మానవహారాలు



చీరాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్ వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, ఇవి కేవలం ఆయా యజమానులకు మాత్రమే సంతృప్తినిస్తాయని ఐటీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పేర్కొన్నారు. సార్వత్రిక సమ్మెను బుధవారం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వసంతరావు, గోసాల సుధాకర్, కాలేషా, రామకృష్ణ, అమీర్, బాబ్జీ, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులను రద్దు చేయాలి

అద్దంకిటౌన్ : కార్మికులు హక్కులను కాలరాసే లేబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా అద్దంకిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్, సీఐటీయూ మండల అధ్యక్షురాలు జి.శారద, వివిధ యూనియన్‌ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్మికులు

సంతమాగులూరులో..

సంతమాగులూరు: సీఐటీయూ ,ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్యకర్తలు, ఐసీడీఎస్ , తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనను తెలియజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నాయకులు గంగయ్య, విజయ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాదర్ బాష, మేకల రమణయ్య, చీదర్ల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో

బల్లికురవ : బల్లికురవలో సీపీఎం నేతలు, సీఐటీయు నేతలు, అంగన్ వాడీ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నేతలు సీహెచ్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో

పంగులూరు : పంగులూరులో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె జరిగింది. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులను మూసివేయించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన కూడలివరకు ర్యాలీ చేసి అక్కడ మానవహారం నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు, రైతు సంఘం జిల్లా నాయకులు రాయిణి వినోద్‌బాబు, తలపనేని రామారావు, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

చినగంజాంలో

చినగంజాం : కార్మికులకు శ్రమను పెంచే లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ బాపట్ల జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక మండల కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మండల సీఐటీయూ నాయకులు జీవి.రాంప్రసాద్‌రెడ్డి, డి.రాఘవులు, సీ.హెచ్.శ్రీను, పుల్లారావు, అనీల్, పీ.ఆదాం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో

ఇంకొల్లు : ఇంకొల్లులో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె జరిగింది. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య , రైతుసంఘం నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, శంకరరావు, భానుప్రసాద్, గోవిందరాజు, సుజాత, అంగన్‌వాడీ , ఆశ, పంచాయితీ కార్మికులు పాల్గొని గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

పర్చూరులో

పర్చూరు : కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ప్రభుత్వం తీసుకు వచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయు నాయకులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో ఎర్ర జండాలు చేపట్టి స్థానిక బొమ్మల సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు నరిశెట్టి ఆచార్యులు, కౌలు రైతు సంఘం నాయకులు బండి శంకరరావు, సీపీఎం నాయకులు మత్తె డేవిడ్, బండారు చినదాసు, చింతగుంట శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మార్టూరులో ర్యాలీ

మార్టూరు :కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని అందరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా బాధ్యులు బత్తుల హనుమంతరావు అన్నారు. బుధవారం జరిగిన సమ్మెలో భాగంగా మార్టూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగనవాడీ, ఆశా కార్యకర్తలు, వీవోఏ సంఘం సభ్యులు, బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకులు, హమాలీ యూనియన్ నాయకులు,వివిధ కార్మిక సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాలెపు సాంబయ్య, వీ రవల్లి కృష్ణమూర్తి, సూరిబాబు, శేషాద్రి, అంగన్‌వాడీ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఎర్ర జెండాలతో నిరసన ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు

ఫసల్ బీమాలో నమోదు కావాలి



అర్హుల లిస్టును నోటిస్‌బోర్డులో పెడుతున్న అధికారులు

బల్లికురవ, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజనలో ప్రీమియం నగదు చెల్లించి పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ ఏవో శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం, వైదన గ్రామాలలో పోలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల వివరాలను, బీమా పథకాల వివరాలను నోటీస్ బోర్డులో పెట్టారు. ఏఈవో మౌలాలి, వీఏఏ రమణ, శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం

అద్దంకిటౌన్ : అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని వ్యవసాయ సహాయకులు(ఏడీఏ) బి. ఏబ్రాయిం అన్నారు. బుధవారం మండలంలోని నాగులపాడు, వెలమూరిపాడు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉండి జాబితాలో పేర్లు లేని రైతులు గ్రీవెన్స్‌లో నమోదుకు ఈనెల 13వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. గ్రీవెన్స్ కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సై వెంకటేశ్వర్లు

మత్తు పదార్థాలపై దుకాణాల్లో ముమ్మర సోదాలు

చీరాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : చీరాల టూటౌన్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిధిలో దుకాణాలు, అనుమానిత ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. దుకాణదారులకు హెచ్చరికలు చేశారు. సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా సోదాలు జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు లోనై జీవితాలను వృథా చేసుకోవద్దు

పర్చూరు : చెడు అలవాట్లకు లోనై జీవితాలను వృథా చేసుకోవద్దని ఎస్సై జీవీ చౌదరి అన్నారు. రాష్ట్ర పోలీస్‌శాఖ ఆదేశాల మేరకు ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్చూరులోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల సమీపంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై సురేష్ రెడ్డి, శారదా హైస్కూల్ కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో కలిసి పంటలను పరిశీలిస్తున్న ఏవో రామమోహన్‌రెడ్డి

త్వరలో మేదరమెట్లలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం

మేదరమెట్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి):మేదరమెట్లలో త్వరలో హెచ్‌డీ నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని మండల వ్యవసాయ అధికారి ఎస్. రామమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రాచపూడి, మేదరమెట్ల గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తేమశాతం 20 కంటే ఎక్కువ ఉండకూడదని, పచ్చ, నల్ల ఆకులు గ్రేడింగ్ చేసి కొత్త వారికి చెక్కులు కట్టుకోవాలని రైతులకు తెలియజేశారు. హెచ్‌డీఎక్స్ రూ. 6వేలు, హెచ్‌డీఎం రూ. 9వేలు, 12 వేలు చొప్పున మూడు గ్రేడ్‌లుగా నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 30వ తేదీలోపు ప్రధాన మంత్రి పంటల బీమా పథకం ద్వారా రైతులు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాల వలన భూమికి కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బైటమంజులూరు పొలాలలో కాలిపోతున్న సుబాబుల్ తోట

మంటలు అంటుకుని సుబాబుల్ తోట పాక్షిక దగ్ధం

పంగులూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని బైటమంజులూరు గ్రామ పొలాలలో మంటలు అంటుకుని సుబాబుల్ తోటకు పాక్షిక నష్టం వాటిల్లింది. గ్రామంలోని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పంటించడంతో సమీపంలో ఉన్న సరికొండ నరసరాజుకు చెందిన సుబాబుల్ తోటకు మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించిన గ్రామ యువకులు అప్రమత్తమయి అద్దంకి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. సుబాబుల్ తోటకు మంటలు వ్యాపించడంతో రూ. 50 వేలవరకు పంట నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మార్టూరు,జూలై9(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోరె వెంకటేశ్వరరెడ్డి (68)మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సైదా బుధవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు మృతుడి స్వగ్రామం ఉమ్మడి ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం తిరుమలరెడ్డిపల్లి. ఆయన కుమారుడు చంద్రశేఖరరెడ్డి బల్లికురవ మండలం కొప్పెరపాలెం లో గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్నారు.అయితే నాలుగు రోజుల క్రితం కొప్పెరపాలెంలోని కుమారుని దగ్గరకు వచ్చిన వెంకటేశ్వరరెడ్డి విజయవాడలో ఉన్న మరో కుమారుని దగ్గరకు వెళ్లేందుకు ఈ నెల 7 వతేదీన సోమవారం ద్విచక్రవాహనంపై కుమారునితో కలిసి మార్టూరు వస్తున్నారు. ఈ క్రమంలో మార్టూరు,నాగరాజుపల్లి గ్రామాల మధ్య పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొన్నది.ఈ ప్రమాదంలో గాయపడిన తండ్రి,కుమారులను నరసరావుపేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం తండ్రి వెంకటేశ్వరరెడ్డిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా,అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి మృతునికి పోస్టు మార్టం నిర్వహించామని, మృతదేహాన్ని అతని స్వగ్రామానికి బంధువులు తీసుకువెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు

ఈపూరుపాలెం(చీరాల), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కుల దూషణకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై ఈపూరుపాలెం పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని బుర్లవారిపాలెంకు చెందిన తెలగతోటి కిషోర్‌కు, తోటవారి పాలెంకు చెందిన ఉప్పాల చంద్రశేఖర్‌కు భూ వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో ఇటీవల పొలంలో తనపై కుల దూషణ చేశారంటూ కిషోర్ ఎస్సీఎస్టీ ట్రయిల్‌కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఈపూరుపాలెం పోలీసులు చంద్రశేఖర్‌తో పాటు మరో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.